ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 17 అక్టోబరు 2024 | 5





కాకినాడలో...



తెగ.. తాగేశారు!

జిల్లాలో తొలి రోజు మద్యం దుకాణాలన్నీ కళకళ

కొబ్బరికాయ కొట్టి దిష్టి తీసి వైన్‌షాపులు ప్రారంభించిన నిర్వాహకులు

అద్దె షాపుల సమస్యతో తొలి రోజు 120 దుకాణాల్లోనే విక్రయాలు

డిపో నుంచి రూ.10.78 కోట్ల సరుకు బయటకు

షాపుల్లో తొలి రోజు మద్యం అమ్మకాలు రూ.1.70 కోట్లు



సర్పవరంలో...

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొత్త ప్రైవేటు మద్యం దుకాణాలు తొలిరోజు అమ్మకాలతో పోటెత్తాయి. మందుబాబుల క్యూతో షాపులన్నీ కళకళలాడాయి. అయిదేళ్ల పాటు నాసిరకం మద్యం సేవించిన మందుబాబులు కూటమి ప్రభుత్వంలో బుధవారం నుంచి నాణ్యమైన మద్యం అమ్మకాలు ప్రారంభం కావడంతో క్యూకట్టారు. నచ్చిన ప్రముఖ బ్రాండ్లను కొనుగోలు చేశారు. కొంద రైతే ఆనందంతో దుకాణాల వద్దే చిందులేశారు. ఇన్నాళ్లకు మళ్లీ అలవాటైన నాణ్యమైన మద్యం దొరికింది అంటూ ఉత్సాహం చూపించారు. కాగా జిల్లాలో మొత్తం 155 మద్యం దుకాణాలకుగాను తొలిరోజు జిల్లావ్యాప్తంగా 120 వైన్‌షాపులే తెరుచుకున్నాయి. మిగిలిన వాటికి పలుచోట్ల అద్దె దుకాణాలకు స్థలం దొరక్కపోవడంతో తెరుచుకోలేదు. దీంతో ఇవన్నీ గురువారం నుంచి విక్రయాలు ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా కొత్త మద్యం దుకాణాలకు మద్యం డిపో నుంచి బుధవారం తెల్లవారు వరకు సరుకు వెళ్తూనే ఉంది. మొత్తం రూ.10.78 కోట్ల విలువైన ఐఎంఎల్, బీరు కేసులను డిపో అధికారులు షాపులకు విక్రయించారు. అటు తొలిరోజు బుధవారం జిల్లాలో 120 మద్యం షాపుల్లో రూ.1.70 కోట్ల సరుకు అమ్ముడైంది. వాస్తవానికి గత వైసీపీ సర్కారు హయాంలో జిల్లాలో రోజుకు రూ.70 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు మద్యం అమ్ముడయ్యేది. విక్రయించిందంతా నాసిరకం సరుకే అయినా ప్రత్యామ్నాయం లేక మందుబాబులు ఈ నాసిరకం సరుకే తాగేవారు. అయితే బుధవారం నుంచి నాణ్యమైన మద్యం తక్కువ ధరకే అందుబాటులోకి రావడంతో మందుబాబులు పూటుగా తాగేశారు. కాగా లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు తొలిరోజు కొత్త మద్యం దుకాణాలను ముస్తాబు చేశారు. పూజలు చేసి అలంకరించారు. సరుకును దుకాణంలో పేర్చి ఆనందంతో సెల్ఫీలు తీసుకున్నారు. ఇదిలాఉంటే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలు కంపెనీలకు చెందిన ఊరుపేరు లేని బ్రాండ్లనే విక్రయించారు. కానీ కూటమి ప్రభుత్వం బుధవారం నుంచి డిపోల్లో అన్నీ ప్రముఖ కంపెనీలకు చెందిన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. విస్కీ బ్రాండ్లకు సంబంధించి 88 రకాలు, బ్రాందీ సెగ్మెంట్‌లో 44, రమ్ము సెగ్మెంట్‌లో 8, వోడ్కాలో 8, వైన్ విభాగంలో 17, బ్రీజర్‌లో నాలుగు రకాలు, స్ట్రాంగ్ బీరులో 9 కంపెనీల చొప్పున వివిధ రకాల మద్యాన్ని మందుబాబులకు అందుబాటులో ఉంచింది. విస్కీ, బ్రాందీ రూ.120, రమ్, వోడ్కా రూ.230, బ్రీజర్ రూ.130 ప్రారంభ ధరలుకాగా, బీరు ధర రూ.120-270 వరకూ ఉంది. ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి వచ్చినా బ్రాండ్లు ఇంకా రాకపోవడంతో మందు బాబులు షాపుల సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. కొద్దిగా సమయం పడుతుందని వారు సమాధానం ఇస్తున్నారు.

సామర్లకోట మద్యం డిపో నుంచి సరఫరా

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ ఐఎంఎల్ డిపో ద్వారా జిల్లాలోని 155 మద్యం దుకాణాలకుగానూ బుధవారం 154 మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేసినట్టు డిపో అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సామర్లకోట పరిధిలో నిన్నటి వరకూ ప్రభుత్వ మద్యం దుకాణాన్ని నిర్వహించిన ప్రాంతంలో మద్యం షాపుపెడితే సహించేది లేదంటూ ఏఐఎండీఎస్ ఆధ్వర్యంలో దుకాణ తలుపులకు హెచ్చరిక పత్రం అతికించడం గమనార్హం. కొత్త దుకాణాలు ఏర్పాటుచేసేచోట వేలల్లో అద్దెలు డిమాండు చేస్తుండడంతో పాటదారులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని ఒక గ్రామంలో పెంకుటిశాలకు నెలకు రూ.50 వేలు అద్దె, లక్ష రూపాయల అడ్వాన్సు డిమాండు చేయడం విశేషం.

ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

కాకినాడరూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలోని సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ బాలికల ప్రాథమిక పాఠశాల (క్రిస్టియన్ మైనార్టీ)లో 7 ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదలచేసినట్టు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాలకు https://cse.ap.gov.in/AidedRecruitmentNotifications వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవాల్సిన అభ్యర్థులు ఉంటే ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో తెలిపారు.

దళితుల భూసమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దళితుల భూసమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ కారెం శివాజీ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు పరిహారం అందజేయాలని కోరారు. కాకినాడ రూరల్ గంగనాపల్లిలో ప్రభుత్వభూములు, రైల్వే భూములు అన్యాక్రాంతం అయ్యాయని వాటిపై విచారణ చేయాలని ఆయన కోరారు.



భారీగా పెరిగిన బాలాత్రిపుర సుందరి ఆలయ ఆదాయం

కాకినాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కాకినాడ సూర్యారావుపేటలోని శ్రీ బాలా త్రిపురసుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం ఆదాయం రికార్డు స్థాయిలో పెరిగింది. గత ఏడాది 2023 ఉత్సవాల్లో రూ.30 లక్షల 39 వేల 954 ఆదాయంరాగా, ఈ ఏడాది 2024 ఉత్సవాల్లో రూ.39 లక్షల 42 వేల 702 ఆదాయం లభించింది. దీంతో గత ఏడాది కంటే రూ.9 లక్షల 2 వేల 748 అదనంగా సమకూరింది. దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.6 లక్షల 55 వేల 720, సేవా టిక్కెట్ల ద్వారా రూ.39 వేల 900, అన్నదానం విరాళాల ద్వారా రూ.2 లక్షల 3 వేల 643, గోశాల విరాళాల ద్వారా రూ.3 వేల 485 అదనపు ఆదాయం సమకూరింది. త్రిపుర సుందరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నిర్ణయించడం, అందుకనుగుణంగా ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గ్రంధి బాబ్జి, కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి ఏర్పాట్లు చేయడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

కో..రంగదే!



కోరంగిలో విదేశీ అతిథుల సందడి..

- అభయారణ్యానికి వేలాదిగా రాక
- ఆరంభమైన సీజన్
- 5 వేల కిలోమీటర్లు పయనం
- ఐదు దేశాల నుంచి వేడర్స్ పక్షులు
- ఆయా దేశాల్లో మంచు కారణం
- గుంపులు..గుంపులుగా సందడి
- అక్టోబరు టు ఫిబ్రవరి ఇక్కడే మకాం
- చంబల్ నుంచి ఇండియన్ స్కిమ్మర్
- 108 జాతులకు చెందిన పక్షులు
- 40 వేలకుపైగా కనువిందు
- 2025 జనవరిలో విదేశీ పక్షుల గణన

ఎక్కడ చైనా.. ఎక్కడ నైజీరియా.. తదితర 8 దేశాలు మ్యాప్‌లో కూడా గుర్తించడం కష్టమే.. నోరు లేని మూగజీవాలు మాత్రం ఆయా దేశాల నుంచి ప్రతి ఏడాది అక్టోబరులో వలస వచ్చేస్తాయి.. ఐదు నెలల పాటు ఇక్కడే ఉంటాయి.. ఒక్కటి కాదు.. వందలు కాదు.. 41 వేలు పైనే 108 జాతులకు చెందిన పక్షులు వస్తాయి. కనువిందు చేస్తాయి.. ఒకసారి ఆ విదేశీ పక్షులను చూడాలని ఉందా.. అయితే ఒకసారి కాకినాడ చెంత ఉన్న కోరంగి అభయారణ్యానికి వెళ్లాల్సిందే.. ఇంకెందుకు ఆలస్యం పదండి.. చూసొద్దాం..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందచందాలకు నెలవైన కోరంగి అభయారణ్యానికి అప్పుడే విదేశీ అతిథుల తాకిడి మొదలైంది. వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ గుంపులు గుంపులుగా వచ్చేశాయి.. ఈ అతిథులు ఇక్కడ ఏకంగా ఐదు నెలలు మకాం వేస్తాయి.. ఇలా వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ ఇక్కడకు వచ్చేది ఎందుకో తెలుసా.. కేవలం ఆహారం కోసం.. పక్షులు ఉండే దేశంలో వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పుల కారణంగా ప్రతి ఏడాది అక్టోబరు నాటికి వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ కాకినాడలోని కోరంగి అభయారణ్యానికి అతిథులుగా వస్తాయి..రష్యా,చైనా, సైబీరియా, మంగోలియా దేశాల నుంచి వందల పక్షులు అభయారణ్యానికి చేరుకున్నాయి. అంతే కాదండోయ్ మధ్యప్రదేశ్,రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న చంబల్ నుంచి ఇండియన్ స్కిమ్మర్ పక్షులు తాజాగా కోరంగికి చేపల కోసం విచ్చేశాయి.

ఎన్నెన్ని అందాలో...

చూడ్డానికి అందంగా, గుబురుగా...దట్టంగా కనిపించే మడ అడవులు దేశంలో కాకినాడకే ప్రత్యేకం. నదీ జలాలు సముద్రంలో కలిసేచోట చిత్తడినేలల్లో పెరగడమే వీటి ప్రత్యేకత. సాధారణంగా ఉప్పునీటిలో చెట్లు పెరగవు. కానీ కేవలం అందులోనే పెరిగి, ఊత వేర్లతో ఒకదానికొకటి పెనవేసుకుపోయే చెట్లు,పొదల సముదాయమే మడ అడవులు. ప్రపంచవ్యాప్తంగా 18 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో ఇవి వ్యాపించగా ఎక్కువగా ఇండోనేషియా,బ్రెజిల్,ఇండియా, బంగ్లాదేశ్‌లో ఇవి ఉన్నాయి. రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో 331.5 చదరపు కిలోమీటర్లలో ఇవి విస్తరించగా, కృష్ణా పరీవాహక ప్రాంతంలో 250 చదరపు కిలోమీటర్లు ఉన్నాయి. అత్యధికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరా ల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా కేంద్రం గుర్తించింది. విస్తీర్ణంలో దేశంలో రెండో అతిపెద్ద మడ అడవులు ఇవి. ఉమ్మడి జిల్లాలో ఈ మడ అడవులను మొత్తం తొమ్మిది అభయారణ్యాలుగా గుర్తించారు. ఇందులో కోరంగి అభయారణ్యం అతి పెద్దది. ఇది 42.42 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఆ తర్వాత కోరంగి విస్తరణ (194) భైరవపాలెం (9.71), రాతి కాల్వ 20.43,మాసానితిప్ప (10.89) మట్లతిప్ప (04.45), బలుసుతిప్ప (4.75), కొత్తపాలెం (0.58) కొత్తపాలెం (0.58), కందికుప్ప (38.02) చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ 80 రకాల వృక్షజాతులున్నాయి. కోరంగి అభయారణ్యంలో 24 కుటుంబాలకు చెందిన 35 జాతుల మడ మొక్కలున్నాయి.ఏటా ఎనిమిది దేశాల నుంచి 120 జాతుల విదేశీ,స్వదేశీ వలస పక్షు లు కోరంగికి వస్తాయి. ఏటా అక్టోబర్ నుంచి వివిధ దేశాల పక్షులు రావడం ఆనవాయితీ.. ప్రస్తు తం ఇక్కడకు రష్యా, చైనా, సైబీ రియా,మంగోలియా దేశాల నుంచి వేడర్స్ జాతికి చెంది పక్షులు కొన్ని రోజులుగా వచ్చి విడిది చేస్తున్నాయి. వేడర్స్ పక్షుల్లో మొత్తం 56 జాతులు ఉన్నాయి. ఇవన్నీ గుం పులు గుంపులుగా కోరంగికి వస్తు న్నాయి.గ్రేట్ నాట్, బ్లాక్‌టైల్ గాడ్‌విట్, బ్రోడ్ బిల్డ్ శాండ్ పైపర్, క్లాబ్ ప్లోవర్, గ్రేటర్ ఫ్లెమింగో తదితర జాతులకు చెందిన విదేశీ పక్షులు ఇక్క డకు విడిదిగా మరికొన్ని రోజుల్లో రానున్నాయి.



ఏటా 40 వేల పక్షులు పైనే...

ఏటా అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు ఐదు నెలల పాటు కోరంగికి విదేశీ,స్వదేశీ పక్షుల తాకిడి ఉంటుంది.ఏటా జనవరిలో రెండు రోజుల పాటు కోరంగి అభయారణ్యానికి చెందిన అటవీశాఖ అధికారులు పక్షుల గణాం కాలు సేకరిస్తారు. ఇందుకు పక్షులను గణించే నిపుణులను దేశవ్యాప్తంగా పిలుస్తారు.వీరందరినీ 12 గ్రూపులుగా విభజిస్తారు.ఒక్కో గ్రూపులో ఐదు గురిని ఉంచి రెండు రోజుల పాటు సర్వే చేస్తా రు. వీరంతాఫొటోలు,బైనాక్యులర్స్ ఆధారంగా ఆయా పక్షులు ఏదేశం నుంచి వలస వచ్చా యి? ఎన్ని వచ్చాయి? అనే వివరాలు తయారు చేస్తారు.ఆ తర్వాత పక్షుల సంఖ్యతో కూడిన నివేదికను బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్)కు పంపుతారు.దీని ప్రకారం ఈ ఏడాది జనవరిలో కోరంగికి 108 జాతులకు చెందిన 41,131 పక్షులు వచ్చినట్టు లెక్క తేల్చారు. 2017లో 43,718, 2020లో 26,734, 2021లో 34,207, 2022లో 46,546 విదేశీ,స్వదేశీ పక్షులు కోరంగికి వచ్చాయి.ఏటా జనవరిలో కోరంగి అభయారణ్యం,పరిసరాల్లోని 12 ప్రాంతాల్లో సర్వే చేస్తారు.



అక్కడంతా మంచే మంచు...

ఏటా అక్టోబర్ నుంచి రష్యా చైనా, సైబీరియా, మంగోలియా, ఓమన్, అరబ్ తదితర దేశాల్లో శీతాకాలం ప్రభావంతో విపరీతంగా మంచు కురుస్తుంటుంది. దీనివల్ల అక్కడ పక్షులకు ఆహారం దొరకదు. పచ్చిక బయళ్లు, చెట్లు, అడవులు పూర్తిగా మంచుతో కప్పేసి ఉంటాయి. దీని వల్ల పక్షులకు ఆహార సమస్య ఉంటుంది. దీంతో భూ మధ్య రేఖకు దిగువన ఉన్న ఇండియాలోని కోరంగి అభయారణ్యానికి వలస వస్తాయి. ఇలా ఆయా దేశాల నుంచి దాదాపుగా 4,500 కిలోమీ టర్ల నుంచి 5,800 కిలోమీటర్ల దూరం ఎగురు కుంటూ ఇక్కడకు చేరుకుంటాయి. ఇక్కడ కోరంగిలో చిత్తడి వాతావరణం, గుబురుగా ఉండే చెట్లు, తక్కువ ఎత్తులో నీరు ఉండడంతో విదేశీ పక్షులకు ఆహారం సులువుగా దొరుకుతుంది. దీని వల్ల వేలాదిగా ఇక్కడకు వస్తాయి. ఏటా ఇక్కడకు వచ్చే పక్షులు 35 వేల వరకు ఉంటాయని చెబుతున్నారు.

చంబల్ నుంచీ వచ్చేస్తున్నాయి..

దేశంలోని చంబల్ ప్రాంతం నుంచీ ఇండియన్ స్కిమ్మర్ పక్షుల తాకిడి ఆరంభమైం ది. ప్రస్తుతం 800 వరకు పక్షులు ఇక్కడకు చేరుకున్నాయి. స్కిమ్మర్ జాతి పక్షులు అధికంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో విస్తరించి ఉన్న అభయారణ్యం నుంచి కోరంగికి వస్తాయి. ఇవన్నీ చంబల్, మహానది ప్రాంతంలో పిల్లలను కంటాయి.అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఆహారం కోసం 1,300 కిలోమీటర్లు ఎగురుకుంటూ కోరంగికి వస్తాయి. వీటిని నది ఊడ్చి పక్షి అంటారు. వీటి కింద దవడ పొడవుగా ఉంటుంది. చిత్తడిగా ఉన్న కోరంగి మడ అడవుల్లో బురదను చీల్చి కిందకు దవడను ఉంచి చేపలను వేటాడి తినడం వీటి ప్రత్యేకత.ఇవికాకుండా స్వదేశీ పక్షులు మరిన్ని వచ్చేనెలలో ఇక్కడకు రానున్నాయి.



కాకినాడలో భారీ వర్షం

కార్పొరేషన్(కాకినాడ),అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో బుధవారం సాయంత్రం నగరంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై చెదురుముదురు జల్లులు పడ్డాయి. సాయంత్రం మాత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వర్షంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వర్షం పడినంత సేపు ఎక్కడి జనం అక్కడే ఉండిపోయారు. నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి.

గవర్నమెంట్ నర్సుల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ

జీజీహెచ్ (కాకినాడ) అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంట్ నర్సుల ఎన్నికల సందర్భంగా బుధవారం జీజీహెచ్‌లో నామినేషన్ల ప్రక్రియ జరిగింది. మొత్తం 9 పదవులకుగాను 3 ప్యానల్స్‌లో ఈ ఎన్నిక జరగనుంది. బుధవారం 9 నామినేషన్ పత్రాలు దాఖలైనట్టు ఎన్నికల అధికారిణి నందన తెలిపారు. ఈనెల 23న ఎన్నిక జరగనున్నట్టు ఆమె చెప్పారు.



ప్రమాదమా.. ఆ తొలిగంటే కీలకం!

6



తుని రైల్వే స్టేషన్‌లో మంటలు

7

పరుగులు తీసిన ప్రయాణికులు

తప్పిన ప్రమాదం



ఆసుపత్రిలో అందుతున్న సేవలపై రోగి బంధువును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

కార్పొరేట్‌కు దీటుగా జీజీహెచ్

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

జీజీహెచ్ (కాకినాడ) అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయిని అయిన కాకినాడ జీజీహెచ్‌ను కార్పొరేట్‌కు దీటుగా సమగ్రాభివృద్ధిలో నిలుపుతామని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ఆయన బుధవారం జీజీహెచ్‌లో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ఓపీ విభాగం వద్ద ఓపీ రసీదులు ఇచ్చే విధానాన్ని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ పేరు నమోదు చేసుకునేందుకు వచ్చిన వారితో ఎక్కడ నుంచి, ఎందు నిమిత్తం ఆసుపత్రికి వచ్చారు, ఓపీ నమోదు చేసుకోవడంలో వస్తున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అత్యవసర విభాగం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, ఎంఆర్ఐ యూనిట్, ఎక్స్‌రే యంత్రాల పని తీరు, కేన్సర్ విభాగంలో రేడియేషన్, కిమోథెరపీ చికిత్సల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ వార్డుల్లో మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతోపాటు ప్రతిరోజు ఫోటోలను పంపించాలని ఆదేశించారు. అనంతరం న్యూరోసర్జరీ, న్యూరో మెడిసన్ విభాగాలను పరిశీలించి అవసరమైన పరికరాలు, సిబ్బంది ఖాళీల వివరాలు అడిగారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో నరాల బలహీనతను గుర్తించేందుకు అవసరమైన ఎన్‌సీఎస్, ఈఈజీ యంత్రాల అవసరతను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం క్యాత్‌లాబ్, ట్రామా కేర్ యూనిట్లలో అవసరమైన పరికరాలు, సిబ్బంది గురించి ఆరా తీశారు. తదుపరి మెడికల్ వార్డును సందర్శించి అక్కడ రోగులతో మాట్లాడారు. అనంతరం జనరల్ సర్జరీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్ వార్డులను పరిశీలించారు. జీజీహెచ్‌లో రోగులకు, క్షతగాత్రులకు, గర్భిణీలు, బాలింతలకు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డా. పి.శ్రీనివాసు, సీఎస్ ఆర్‌ఎంవో డా.కోనాల అనిత, ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డా.ఎంపీఆర్ విఠల్, డా.సత్యవాణి తదితరులు ఉన్నారు.



ప్రమాదమా.. ఆ తొలి గంటే కీలకం!

నేడు వరల్డ్ ట్రామా డే

జీవితం అనిశ్చితం.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. అకస్మాత్తుగా ఏదో రోడ్డు ప్రమాదానికో గురై గాయాలు కావచ్చు. అనుకోకుండా మంటలు చెలరేగి చర్మం కాలవచ్చు. హఠాత్తుగా పనిచేస్తున్న పరిశ్రమలోనో లేదా పెద్దవాళ్లు ఏ బాత్‌రూమ్‌లోనో జారిపడిపోతే గాయపడొచ్చు. ఇలా అనుకోకుండా ప్రమాదం జరగడం, ప్రమాదవశాత్తూ గాయాలపాలైతే వైద్య పరిభాషలో ట్రామా కేసులుగా పరిగణిస్తారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కోసం ప్రతీ ఏడాదీ అక్టోబరు 17న వరల్డ్ ట్రామా డేగా నిర్వహిస్తుంటారు.



(పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లోనే ట్రామా కేసులెక్కువ. దీనివల్ల తలకు గాయాలు, ఎముకలు విరగడం వంటివి జరుగుతాయి. ప్రతీ ఏటా రోడ్డు ప్రమాదాలకు మన ప్రాంతంలోనే వందలాది మంది మరణిస్తుండగా, వేలాది మంది తీవ్రగాయాలపాలవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ప్రమాదాలకు సంబంధించి జరిగిన సర్వేల్లో ప్రతి ఆరు సెకండ్లకు ఒక మరణం సంభవిస్తోందని తేలింది. దేశవ్యాప్తంగా కూడా ఏటా 10 లక్షల మంది మృతి చెందడంతోపాటు రెండు కోట్ల మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. యువతలో సంభవించే మరణాల్లో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారు అందులో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు వారే ఎక్కువ. యాక్సిడెంట్లలో లేదా పెద్దవయసు కారణంగా తలకు గాయలు, ఎముకలు విరగడాలు, రోడ్డు ప్రమాదాలు ఇతరత్రా ప్రమాదాల్లో తలకు గాయం కావడం మామూలే. పెద్దవయసు వారిలో మజిల్ మాస్ తగ్గడం, కాళ్లలో స్పర్శజ్ఞానం మందగించడం, అకస్మాత్తుగా స్పృహ తప్పడం, అకస్మాత్తుగా బీపీ తగ్గిపోవడం, కొందరిలో పక్షవాతం, పార్కిన్సన్స్ డిసీజ్ కారణాలతో పడిపోతే తలకు గాయాలు, ఎముకలు ప్రధానంగా తుంటి ఎముక వంటివి విరగడంలాంటివి జరగవచ్చు.

ప్రమాదాల్లో ముందుగా పరిశీలించాల్సిన లక్షణాలు..

- స్పృహ కోల్పోవడం, ఫిట్స్ రావడం
- రెండు అంతకన్నా ఎక్కువ వాంతులు కావడం, చెవి, ముక్కులోంచి రక్తం రావడం
- ప్రమాదానికి ముందు మొదలుకుని 30 నిముషాలలోపు జరిగిన సంఘటనలు గుర్తులేకపోవడం
- తలకు గాయాలైతే తక్షణ సాయంగా ముందుగా అంబులెన్స్ ద్వారా పారా మెడికల్ లేదా ఎమర్జెన్సీ వైద్య సిబ్బంది నుంచి సహాయం అందాలి.
- ఆసుపత్రికి తీసుకొచ్చాక ఎమర్జెన్సీలోనే చికిత్స ప్రారంభంకావాలి. ఎందుకంటే మెదడుకు జరిగిన నష్టాన్ని మళ్లీ భర్తీ చేయడం కష్టం కాబట్టి చికిత్స త్వరగా అందాలి.
- రక్తస్రావం అవుతుంటే దాన్ని ఆపాలి.

రోడ్డు ప్రమాదాలు.. ప్రథమ చికిత్స

సహాయంకోసం పిలవడం (కాల్ ఫర్ హెల్ప్). దీనివల్ల సమీప హాస్పటల్‌కు బాధితుల్ని వీలైనంత త్వరగా తరలించడానికి వీలవుతుంది. దగ్గర్లోని ఆసుపత్రి వివరాలను అంతకంటే ప్రధానంగా అంబులెన్స్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవడం మంచిది.

తలను కదల్చకుండా ఉంచేలా..

తొలుత తలను కదల్చకుండా (హెడ్ ఇమ్మొబిలైజేషన్) ఉంచాలి. ఎందుకంటే తలకు గాయాలైన సందర్భాల్లో మెడకూ, వెన్నుపూసకు గాయాలైనప్పుడు తలను కదల్చకుండా ఉంచడం వల్ల వెన్నుపూసలకు సంబంధించి అనర్థాలను నివారించినట్లవుతుంది.

రక్తస్రావాన్ని అరికట్టడం..

రక్తస్రావం జరగడం రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయాలకు దారితీసే ప్రధాన అంశం. అందుకే రక్తస్రావాన్ని అరికట్టడం రోడ్డు ప్రమాద చికిత్సలో కీలకమైన అంశం. ముందుగా రక్తస్రావానికి కారణమైన తీవ్ర గాయం ఏదైనా ఉందేమో పరిశీలించాలి. గాయం కనిపిస్తే దానిపై తగినంత ఒత్తిడితో రక్తస్రావం ఆగేలా చేయాలి. శుభ్రమైన గుడ్డ లేదా గాజుగుడ్డను కూడా ఇందుకు ఉపయోగించవచ్చు. గాయంపై శుభ్రమైన గుడ్డతో రెండు చేతులతో ఒత్తిడి కలిగిస్తూ పది నిమిషాలు అలాగే ఉంచాలి. ఒకవేళ పైన చెప్పినట్టు పది నిమిషాలపాటు ఒత్తిపట్టినా రక్తం ఆగకపోతే ఏదైనా గుడ్డతో గాయంపై రక్తం ఆగేందుకు గట్టిగా కట్టుకట్టి అలా ఎంతసేపు కట్టి ఉంచారో వైద్య బృందాలకు తెలియజేయాలి. అయితే ఇలా గట్టిగా ఒత్తిపట్టి ఉంచడమన్నది కాళ్లు లేదా చేతుల విషయంలోనే జరగాలి తప్ప శరీర భాగాల్లోని మిగతా చోట్ల చేయకూడదు.

కంటి గాయాలు..

కంటికి అనేక రకాలుగా గాయాలయ్యే అవకాశముంది. రైతులు పొలాల్లో నడిచే సమయంలో ముళ్ల చెట్లు, తుప్పలు కంటికి కొట్టుకోవడం, ఇటుక, ఇసుక లారీల్లోంచి పార్టికిల్స్ వచ్చి కళ్లల్లో పడడం, రాత్రి ప్రయాణాల్లో పురుగుల కళ్లకు కొట్టుకోవడం వంటి ప్రమాదాలు జరిగి కళ్లు గాయపడవచ్చు. ఇక పిల్లల విషయానికి వస్తే బంతి, షటిల్ కాక్ వేగంగా ఎగిరివచ్చి కంటికి తగలచ్చు. అలాంటప్పుడు ఈ కింది విషయాలను గమనించాలి.

- కన్నునొప్పి, కంటి వాపు
- కంట్లో ఏదైనా పడినట్టు (ఫారిన్ బాడీ) అనిపించడం
- మసగ్గా కనిపించడం, ఏమీ కనిపించకపోవడం

అందించాల్సిన ప్రథమ చికిత్స..

పొలాల్లో మందు పిచికారీ చేస్తున్నప్పుడు కంట్లో పడితే దాని ప్రభావం తగ్గించడానికి నీళ్లతో కంటిని కడగాలి. రోడ్డు ప్రయాణంలో ఫుల్ ఫేస్ హెల్మెట్ వాడాలి. బంతి/షటిల్ కాక్ కళ్లకు తగలగానే వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి. ఒకగ్లాస్ నీళ్లు తీసుకుని కన్ను ముంచి రెప్పలను ఆడిస్తూ ఉండాలి. కొద్దిసేపటికి ఈ నీళ్లను మారుస్తూ ఉండాలి. కంటి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లేలోపు కంటిని నలపకూడదు.

కాలిన గాయాలు - జాగ్రత్తలు..

గాయం కాగానే కంగారు పడకుండా దానిపై నీళ్లు ధారగా పడేలా చూసుకోవాలి. అలాగే కనీసం 10 నిమిషాలపాటు మంట తగ్గేవరకూ కడగాలి. కాలినప్పుడు బట్ట చర్మానికి అంటుకుంటే దాన్ని తీయకూడదు. డాక్టర్ మాత్రమే దాన్ని తొలగిస్తారు. కాలిన గాయాలపై క్లింగ్ ర్యాప్ (తినే పదార్థాలపై కప్పే ట్రాన్స్‌పరెంట్‌తో చుట్టడంగానీ లేదా కప్పడంగానీ చేయాలి).

- గాయాన్నీ కడగడానికి గది ఉష్ణోగ్రతతో ఉన్న నీళ్లనే వాడాలి. ఐస్ వాటర్ వద్దు. కాలిన గాయం మందం మన అరచేయి మందంలో సగానికంటే ఎక్కువగా ఉన్నప్పుడు లేదా రసాయనాల వల్ల కాలిన గాయమైతే బాధితుల్ని వెంటనే డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాలి. గాయాన్ని ఎప్పుడూ రుద్దకూడదు. గాయాలపై పసుపు, పేస్టు నెయ్యి వంటివి రాయకూడదు.



- డాక్టర్ పి.సరిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో, పెద్దాపురం





అల్పపీడనం.. అనంత వర్ణాలు

ఆకాశం ఎన్నెన్నో వర్ణాలతో అలరిస్తోంది. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు అనుగుణంగా నింగి కూడా రకరకాల రంగుల్లో కనిపిస్తోంది. మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షం పడుతుండడంతో ఆకాశం నీలి, బంగారు, పసుపు రంగుల్లోకి క్షణాల్లో మారిపోతోంది. మబ్బుల మాటున ఈ వర్ణరంజితమైన ఆకాశం ఆకర్షణీయంగా దర్శనమిస్తోంది. చిత్రాలు.. బుధవారం కాకినాడ కల్పన సెంటర్ బ్రిడ్జి వద్ద కారు మబ్బుల వలయం.. ఉప్పాడ తీరంలో ఎగిసిపడుతున్న సముద్ర కెరటాల పైన కనువిందైన దృశ్యం. - కాకినాడ/కొత్తపల్లి



వేకువనే నిద్ర లేచి గుడెసె బయట కట్టెల పొయ్యిపై వంట

బతుకులు మారాలి..

అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా..

- సంచార జీవనం.. ఇప్పటికీ బుడిగె జంగాల తీరు
- పూట గడవాలంటే ఊరూరా తిరగాల్సిందే
- పందిరి గుడెసెలే వారి భవంతులు

ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు పేద బతుకులకు కొంత ఆసరాగా ఉంటున్నప్పటికీ వారి బతుకు చిత్రాల్ని మాత్రం పూర్తిగా మార్చలేకపోతున్నాయి. దీంతో తమ బతుకు కంటే తమ బిడ్డల బతుకులు కాసింత మేలుగా ఉండాలన్న తపన.. అందుకు వారు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అటువంటి జీవితాలు సమాజంలో మన కళ్ల ముందు ఎన్నో కనిపిస్తుంటాయి. అందులో ఒకరు బుడిగె జంగాలు.

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

రోజూ అభివృద్ధి, సంక్షేమం.. ఈ రెండు మాటలూ వింటూనే ఉంటుంటాం. పాలకులు ఏలోటూ రానివ్వకుండా చూసుకుంటున్నామని గొప్పలు చెప్పడాన్నీ ఆలకిస్తుంటాం. నిజంగా అలాంటి వెలుగే ఉంటే ఇదిగో ఇలా సంచార జీవితంతో బతకాల్సిన అగత్యం ఎందుకొస్తుంది. వీరికి చెట్ల కింద పందిరి గుడెసెలే వారి భవంతులు. వేకువనే నిద్రలేవడం.. కట్టెల పొయ్యిపై చారెడు బియ్యం ఉడకేసుకోవడం... భార్యాభర్తలిద్దరికీ చెరో క్యారేజీ సర్దుకోవడం... రాత్రి మిగిలిన సద్దితినడం. ఊళ్లల్లోకి పరుగులు పెట్టడం. ఇది వారి నిత్య జీవన యాత్ర. పాత సామాన్లు కొనడం, వాటిని తిరిగి అమ్ముకోవడం వచ్చిన ఆ కాస్త లాభంతో పూట గడపుకోవడం వారికి నిత్య కృత్యం. ఇదే వారి జీవితం. వారికంటూ భూమి పుట్రా ఏమి లేదు. నాలుగు గోడల ఇళ్లూ లేవు. బ్యాంకు బాలెన్సులు అంతకంటే ఉండవు. ఒక్కో సీజనులో ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకొంటుంటారు. అందుకే వారిని సంచార జీవులంటారు. కాసింత ఎక్కువ చెట్లున్న ప్రాంతమైతే చల్లగా ఉంటుందని ఆ ప్రదేశాన్ని ఎంపిక చేసుకొని అక్కడే పందిరి గుడెసెలు వేసుకుంటుంటారు. వ్యాపారం చేసే బుడిగె జంగాలది ఒక్కో సీజనులో ఒక్కో ఊరు. దీంతో వయసు పైబడిన వారి తల్లిదండ్రులను వారితో పాటే వారి పిల్లల్ని వారి సొంతూర్లలోనే ఉంచేస్తుంటారు. ఇక ఇక్కడి వ్యాపారంలో వచ్చిన సొమ్ములతో వీళ్లు బతుకుతూ తల్లిదండ్రులకు, పిల్లలకు కూడా పంపిస్తుంటారు. అదే సొమ్ములతో పిల్లల చదువులు కూడా. దీంతో వారి సంతానం తల్లిదండ్రులను వదిలేసి నెలల తరబడి ఉండాల్సిన పరిస్థితి. ఒక్కో నెల సరిగా వ్యాపారం సాగని పక్షంలో పూట గడవని పరిస్థితిని ఎదుర్కొంటుంటారు. ఎన్ని గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నా చివరకు వారి బతుకు ఆసరా కేవలం పాడైన సామాన్లు, పాత న్యూస్ పేపర్లు మాత్రమే. వారిలో కొందరు గొడుగులు, గ్యాస్ పొయ్యిల మరమ్మత్తులు చేస్తుంటారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్నకోడు కొండ గ్రామం నుంచి కొన్ని సంచార బుడిగె జంగాల కుటుంబాలు చింతూరు మండలం చట్టి గ్రామంలో గుడెసెలు వేసుకున్నాయి. తమ పిల్లలను పెద్దవాళ్లకు అప్పగించి జీవనోపాధి కోసం వచ్చినట్టు వారు చెప్పారు. ఆడామగా తేడా లేకుండా అందరూ తలోపనీ చేయడం విశేషం.



ఊరూరా తిరిగి పాత బిందెలు కొనుగోలు చేసి తిరిగి నివాస గుడెసెల వద్దకు చేరుకుంటున్న మహిళ

ఇవే మా బతుకులు

అన్ని రోజులు పాత సామాన్లు దొరకవు. ఆరోజు ఊరంతా తిరిగినా కష్టమే మిగులుతుంది. మా పెద్దలది ఇదే బతుకు మాదీ ఇదే బతుకు. వానకాలమైతే వ్యాపారం సాగక పూట గడవడమే కష్టమవుతుంది. పిల్లలకైనా మంచి బతుకు దొరుకుతుందోనన్న ఆశ మాది.

- నిడుగొండ రామకృష్ణ



పాత వస్తువులను కొనుగోలు చేసుకుని వచ్చిన తర్వాత విడదీస్తున్న దృశ్యం



సంచార జీవితంలో గొడుగులు బాగు చేసే పనిచేస్తున్న దృశ్యం

రాజమండ్రిలో రతన్‌టాటా ఇన్నోవేషన్స్ హబ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రక రాజమహేంద్రవరంలో ప్రముఖ వ్యాపారవేత్త రతన్‌టాటా పేరు మీద రతన్‌టాటా ఇన్నోవేషన్స్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో 5 చోట్ల ఈ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గోదావరి జిల్లాలకు కేంద్రంగా రాజమహేంద్రవరంలో ఒక హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సెంట్రల్ హబ్ అమరావతిలో ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజమహేంద్రవరం అభివృద్ధికి ఈ హబ్ ఎంతో ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

గోదావరి మాతకు మహా నీరాజనం

కొవ్వూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు మహానీరాజనం అందజేశారు. ఆశ్వయుజ కోజాగరి పౌర్ణమిని పురస్కరించుకుని గోదావరి నీరాజన సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రదోషకాలంలో క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో గోదావరిమాతకు 229వ మాసోత్సవ మహా నీరాజనంలో భాగంగా పూజలు చేశారు. నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో గోదావరిమాతకు అష్టోత్తర శత కుంకుమార్చనలు నిర్వహించి, వివిధ రకాల హరతులతో మహా నీరాజనం నిర్వహించారు. మహిళలు నేతి దీపాలు వెలిగించి నదిలో వదిలారు. కార్యక్రమంలో పట్టణ, పరిసర ప్రాంతాల భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీ

మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాగ్దానాలను మరచి పట్టభద్రులను, ప్రజలను మోసం చేసిన ప్రభుత్వాలను కౌన్సిల్‌లో తన వాణిని వినిపించేందుకు ఒకరిని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి(స్వతంత్ర అభ్యర్థిగా) దింపుతున్నట్టు అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంతో పాటు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. వాగ్దానాలను నిలబెట్టుకోలేని పక్షంలో ప్రభుత్వాలను రద్దు చేసేలా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాలన్నారు. దళితులపై దాడులు పెరుగుతూనే ఉన్నాయి కాని తగ్గలేదన్నారు. అందుకే నిరుద్యోగులు, దగాపడిన వారి కోసం పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీకి తన మనిషిని దింపుతున్నానని ఆయన తెలిపారు.



రాజానగరం మండలం వెలుగుబందలో కావడి ఉత్సవంలో అయ్యప్ప భక్తులు

కన్నుల పండువగా కావడి ఉత్సవం

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగుబంద గ్రామంలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప కావడి మహోత్సవం క్రతువు కన్నుల పండుగా నిర్వహించారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు పన్నీరు కావడి, పాల కావడితో గ్రామోత్సవం జరిపార. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం స్వాములకు బిక్ష, సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం అనంతరం అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమాలు అయ్యప్ప శరణు ఘోష మధ్య వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులు బసవా రాంబాబు 18వ పర్యాయం అయ్యప్ప మాలధారణ దీక్షను పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో మండలంలోని అయ్యప్పలతో పాటుగా పరిసర గ్రామాల అయ్యప్ప మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఖుష్బూ మెచ్చిన ఉప్పాడ చీర

న్యూఢిల్లీ ఎగ్జిబిషన్‌లో కొనుగోలు

కొత్తపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న నుంచి దేశ రాజధాని న్యూఢిల్లీలో జరుగుతున్న వస్త్ర ప్రదర్శన, అమ్మకాల్లో భాగంగా సినీ నటి ఖుష్బూ ఉప్పాడలో తయారు చేసిన జాంధానీ చీరలు కొనుగోలు చేశారని ప్రదర్శనలో పాల్గొన్న కాకి గంగాధర్ తెలిపారు. ఇప్పటివరకు చేనేత జాంధానీ చీరలు పేరు వినడమే కాని చూడడం ఇదే ప్రథమం అని ఆమె అన్నారని తెలిపారు. ఉప్పాడ జాంధానీ చీర ధరిస్తే ఆ హూందా వేరేగా ఉంటుందని ఖుష్బూ ప్రశంసించారని గంగాధర్ చెప్పారు.



అమ్మవారి ఊరేగింపులో భాగంగా కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు

గోకవరం, అక్టోబరు 16: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గోకవరంలో బుధవారం అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. వీరభద్రుని గద్దెలోని కనకదుర్గమ్మను, దేవీచౌక్ సెంటర్‌లో దుర్గామాతను పూలతో అలంకరించి వేర్వేరు రథాలపై ఉంచి గరగ నృత్యాలు, కోలాటం, నవదుర్గ నృత్యాలు, తీన్మార్ వాయిద్యాల మధ్య గ్రామంలో ఘనంగా ఊరేగించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



సత్యదేవుడికి దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ అధికారి పూజలు

అన్నవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో బుధవారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరెడ్డి సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనాలు అందజేశారు.

వేదాశీర్వచనం పొందుతున్న రైల్వే సేఫ్టీ అధికారి వెంకటరెడ్డి



పిఠాపురం పాదగయ క్షేత్రంలో హుండీలలో లెక్కించిన డబ్బు

పాదగయలో హుండీల ఆదాయం రూ.46.29లక్షలు

పిఠాపురం, అక్టోబరు 16: కాకినాడజిల్లా పిఠాపురం పట్టణం పాదగయ క్షేత్రంలో హుండీలను బుధవారం తెరిచారు. పాదగయలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పుర్హుతికాఅమ్మవార్లు, దత్తాత్రేయస్వామి సన్నిధిలో, ఇతర ప్రాంతాల్లో ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.46,28,750ల ఆదాయం లభించింది. 210రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ పి.విశ్వనాథరాజు, దేవదాయశాఖ తనిఖీదారు వి.ఫణికుమార్, దేవస్థానం, చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకుల సిబ్బంది, శ్రీవారి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

కాకినాడలో ఏలూరు రేంజ్ ఐజీ వార్షిక తనిఖీలు

కాకినాడ క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు,దర్యాప్తు, కేసుల పురోగతి, పెండింగ్ కేసుల వ్యవహారం తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్ని పారదర్శకతతో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సిబ్బంది దైనందిన జీవితంలో ఎటువంటి అనారోగ్యం దరిచేరకుండా వ్యాయామం చేస్తూ తగిన పోషకాహారం తీసుకుంటూ వ్యసనాల జోలికి వెళ్లకుండా ఉంటే జీవితం సాఫీగా సాగుతుందన్నారు. తద్వారా పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐజీ వెంట ఎస్పీ విక్రాంత్ పాటిల్, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, త్రీటౌన్ సీఐ కేవీవీ సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



కెరటాల ఉధృతికి మాయాపట్నంలో కొట్టుకొనిపోయిన మత్స్యకారుల ఇళ్లు

తీరంలో అలల ఉధృతి

- మాయాపట్నంలో 8 గుడిసెలు నేలమట్టం
- మత్స్యకారుల నివాసాల్లోకి దూసుకొస్తున్న కెరటాలు

కొత్తపల్లి, అక్టోబరు 16: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తీరప్రాంతాల్లో కెరటాలు తారాస్థాయిలో ఎగసిపడుతు న్నాయి. ఉవ్వెత్తున ఎగసిపడే రాకాసి అలలు నేరుగా మత్స్యకారుల గుడెసెలవైపు దూసుకొస్తున్నాయి. దీంతో కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం మాయాపట్నంలో 8 గుడెసెలు సముద్రంలో కలిసిపోయాయి. పెంకుటిల్లులపై కప్పు కొట్టుకొనిపోగా మొండి గోడలు ఒడ్డున దర్శనమిస్తున్నాయి. సముద్ర కెరటాల ధాటినుంచి రక్షణగా సూరా డపేటలో గతంలో నిర్మించిన జియో ట్యూబ్‌లపై నుంచి కెరటాలు వేగంగా మత్స్యకారుల ఇళ్లల్లోకి పోటెత్తుతున్నాయి. ప్రతీసారీ తుఫాన్, అల్పపీడనాలు ఏర్పడినప్పుడల్లా తీరప్రాంతాల్లో నివాసం ఉండే మత్స్యకారుల పరిస్థితి చాలా దయనీయంగా మారుతోంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది ప్రజాప్రతినిధులు వచ్చినా తీరప్రాంత రక్షణకు ఎటువంటి శాశ్వత రక్షణచర్యలు చేపట్టకపోవ డంపట్ల మత్స్యకారులు నిట్టూర్పులు విడవడం గమనార్హం. సము ద్రం కల్లోలంగా ఉండటంతో తీరప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులు బోట్లను రామన్నపాలెం, శీలంవారిపాలెం ఉప్పుటేరువద్ద లంగర్‌వేసి భద్రపరిచారు. ఇంజన్లు, విలువైన వలలు ఇతర సామాగ్రిలను ఇళ్లవద్దకు తరలించి జాగ్రత్త చేసుకున్నారు.



మాయాపట్నం మత్స్యకారుల నివాసిత ప్రాంతాల్లోకి చేరిన సముద్రం నీరు

వరుస తుపాన్‌లతో జీవనోపాధికి గండి

ఇటీవల వరుస తుపాన్‌లు సంభవించడంతో తీరప్రాంత మత్స్యకారు లు జీవనోపాధికి గండి ఏర్పడింది. ఈ యేడాది వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందాల్సిన వేట పరిహారం ఇప్పటికీ మంజూరు కాకపోవడం, వరుసు తుపాన్‌లతో ఉపాధి లేకపోవడం వం టి కారణాలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. వేట లేకపోయినా, పరిహారం అందక పోయినా వడ్డీలకు అప్పులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటు న్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రజలను అప్రమత్తం చేస్తున్న కూనవరం ఎస్ఐ లతాశ్రీ, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ కరుణాకర్

పులి ఉంది జాగ్రత్త..

- పాలగూడెం జంక్షన్‌లో పులి సంచారం
- అప్రమత్తం చేసిన ఎస్ఐ, ఎఫ్ఆర్‌వో

కూనవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండల పరిధిలో పులి సంచరిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూనవరం ఎస్ఐ లతాశ్రీ, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ కరుణాకర్ అన్నారు. పులి సంచరిస్తున్న ఆయా గ్రామాల్లో ప్రజలను బుధవారం అప్రమత్తం చేశారు. మండలంలోని పెదనర్సింగపేట, దుగుట్ట, కాచవరం గ్రామాల్లో ఈసందర్భంగా చాటింపులు వేయించారు. పెద్ద పులి పశువులపై ఎటువంటి దాడి చేసిన, పులి ఆనవాళ్లు తెలిసిన వెంటనే అటవీశాఖాధికారులు, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పులి హాని చేస్తుందన్న భయంతో ఎటువంటి విషపూరిత ఆహారం పెట్టడం, కరెంటు తీగలు అమర్చడం వంటివి చేయవద్దని రేంజర్, ఎస్ఐ హెచ్చరించారు.

పాలగూడెం జంక్షన్‌లో పులి

పాలగూడెం జంక్షన్, బోదునూరు పరిసరాల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు బుధవారం రాత్రి గుర్తించారు. పులి సంచరించేందుకు అనువైన ప్రదేశాలు ఈప్రాంతంలో ఉన్నాయి. డీఎఫ్‌వో భవిత, సబ్ డీఎఫ్‌వో కేవీఎస్ రాఘవరావు ఆదేశాల మేరకు ఈప్రాంతంలో సిబ్బందిని ఏర్పాటు చేశామని అటవీ శాఖాధికారి కరుణాకర్ తెలిపారు.

ఆడ పులి జాడ కోసమేనా..?

ప్రస్తుతం మండలంలో సంచరిస్తున్న ఆడ పులి జాడ కోసమే పయనిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అటవీశాఖాధికారుల లెక్క ల ప్రకారం 2012 నుంచి ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుంది. ఆంధ్ర-ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అధికారులు అంచ నా వేస్తున్నారు. ఒక వేళ ఇప్పుడు సంచరిస్తున్న పులి మగ పులి అయితే వర్షాకాలం ముగుస్తున్న సమయంలో 60 స్క్వేర్‌కట్ పరిధిలో పులి తన సరిహద్దులను ఏర్పాటు చేసుకునే అవకాశముంది. పులి ఏర్పా టు చేసుకున్న సరిహద్దుల పరిధిలోకి ఇతర మగ పులులు రాకుండా సరిహద్దు చుట్టూ ఉన్న చెట్లపై తన కోరలతో రక్కి గుర్తులు పెడుతుంది. ఇది గమనించిన ఇతర పులులు ఆ పులి సరిహద్దుల్లోకి వెళ్లవు. అంతేకాకుండా ఆడ పులులను ఆకర్షించడానికి సరిహద్దు చుట్టూ తన మూత్రం పోసి ఆడ పులులను ఆకర్షిస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతం పులి ఇక్కడ సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పులి రామచంద్రపురం అడవు ల్లో దూగుట్టకు రెండు కిలోమీటర్ల పరిధిలో పులి ఓ చెరువు దగ్గర నీళ్లు తాగినట్లు బుధవారం అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పులి తన పనిని ముగించుకుని తన సొంత ప్రాంతానికి ప్రయాణమైనట్లు అధికారులు భావిస్తున్నారు. ఏదేమైనా మండలంలో పులి సంచరిస్తుందని తెలియడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వివాహ వేడుకకు లైటింగ్ బిగిస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో ఒక యువకుడు మృతి చెందాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కె.గంగవరం మండలం వట్రపూడి గ్రామానికి చెందిన శీలం నారాయణమూర్తి కుమారుడు ప్రవీణ్‌కుమార్ (17) అద్దంపల్లి గ్రామానికి చెందిన యనమదల గోవింద్ అనే ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద లైటింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కరప మండలం కొంగోడు గ్రామానికి చెందిన అనుపతి శ్రీను ఇంట్లో వివాహ వేడుకకు సంబంధించిన లైటింగ్ పనుల్లో ప్రవీణ్‌కుమార్ నిమగ్నమయ్యాడు. నిచ్చెన ఎక్కి లైట్లు బిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. క్షతగాత్రుడ్ని గొల్లపాలెం పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి నారాయణ మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం సీతంపేట మూలగొయ్యి మలుపు వద్ద డ్రైనేజీలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కృష్ణాజిల్లా గుణదల ప్రాంతానికి చెందిన కె.శ్రీహరిప్రసాద్(51) స్థానిక గోకవరం బ స్టాండ్‌వద్ద ఒక హోటల్‌లో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా మూలగొయ్యిలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అతనికి ఇక్కడ ఎవ్వరూ లేరు. ఈ క్రమంలో ఈనెల 13నుంచి శ్రీహరి కనిపించడంలేదు. బుధవారం స్థానికులు డ్రైనేజీలో ఒక వ్యక్తి మృతదేహాన్ని గమనించి త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆ మృతదేహం శ్రీహరిదిగా గుర్తించారు. అతడికి ఒక కాలికి పుండ్లు ఉండడంతో కాలు సరిగ్గా పనిచేయదని, మద్యం అలవాటు ఉందని, డ్రైనేజీ గోడపై కూర్చుని మందు తాగుతాడని ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ అందులో పడి ఉంటాడని స్థానికులు పోలీసులకు చెప్పారు. ఈ మేరకు పోలీసులు శ్రీహరి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. కృష్ణాజిల్లా గుణదల ప్రాంతంలోని అతడి బంధువులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత బుధవారం జిల్లాకోర్టు ఆవరణంలో అండర్ ట్రయిల్ ముద్దాయిల కమిటీ మీటింగ్, ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణలో ఉన్న ముద్దాయిల కేసుల దర్యాప్తు, చార్జ్ షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిల్ జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. సంబంధిత న్యాయస్థానాలకు తగిన సిఫార్సులు చేశారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యక్రమాలను, బాధితుల పరిహారం సంబంధిత అంశాల ను ఆమోదించారు. హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. డిసెంబరు 14న జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారయోగ్యమైన వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాల న్నారు. ఈ సమావేశంలో 1వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్, జిల్లా ఎస్పీ డీఎన్ కిశోర్, కాకినాడ అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్ పీటీ ప్రసాద్, రాజమహేంద్రవరం జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, గవర్నమెంట్ ప్లీడర్ సీహెచ్ ప్రసాద్, కొత్తపేట, అమలాపురం డీఆర్‌డీవోలు, సెంట్రల్ జైలు, మహిళా జైలు అధికారులు పాల్గొన్నారు.

అత్తారింటికి వెళ్తూ అనంతలోకాలకు..

- ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



మృతి చెందిన జాలిపర్తి సుధీర్

గోపాలపురం, అక్టోబరు 16: అత్తారింటికని బయల్దేరి తాను నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం లోని గోపవరం, రాంపాలెం గ్రామాల మధ్య బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోపవరం గ్రామానికి చెందిన జాలిపర్తి సుధీర్(30) కరగపాడుకు చెందిన కొక్కిరిపాటి దుర్గశ్రీకి గత రెండేళ్ల క్రితం వివాహమైంది. అయితే గోపవరంలోని ఒక ప్రయివేటు కంపెనీలో జీవనోపాధి కోసం పనిచేస్తున్న సుధీర్ కరగపాడులో అత్తారింటి వద్ద ఉన్న తన భార్యను తీసుకురావడానికి డ్యూటీకి సెలవుపెట్టి గోపవరం నుంచి తన ద్విచక్రవాహనంపై బయల్దేరి కరగపాడు వెళ్తుండగా మార్గమధ్యంలో రాంపాలెం శివారులో తాను నడుపుతున్న వాహనం అదుపుతప్పి రాయిని ఢీకొనడంతో సుధీర్ అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. మృతుని భార్య దుర్గాశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో పౌర సరఫరాల అధికారులు

1120 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రేషన్(పీడీఎస్) బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్టేడియం రోడ్డు సమీపంలోని ఓ షాపులో పేదల బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారంతో దాడులు చేశామని అధికారులు తెలిపారు. 1120 కిలోల బియ్యం మూటలను సీజ్ చేశామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన నాగేంద్రబాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని, నిఘా పటిష్టం చేశామని చెప్పారు. రేషన్ బియ్యాన్ని విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడం వంటివి నేరమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో రాజమహేంద్రవరం డివిజన్ అసిస్టెంట్ సివిల్ సప్లయిస్ అధికారి ఎం.నాగాంజనేయులు, డీటీలు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ మృతి కేసులో

ముగ్గురి అరెస్టు

- వివరాలు వెల్లడించిన చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



నిందితులు వంతుల జయసేన, కిలో పరుశురాం, కిలో దాసు

మోతుగూడెం, అక్టోబరు 16: అడవి జంతువులను వేటాడటం కోసం ఏర్పాటుచేసిన విద్యు త్ తీగలు తగిలి ప్రాణాలు కోల్పోయిన సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.తిరునావు కరసు కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చింతూ రు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మెట్టగూడెం గ్రామం పైవీధి శివారున ఉన్న అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి వంతల జయసేన్, కిలో పరుశురాం, కిలో దాసు అడవి జంతు వుల ను వేటాడటం కోసం విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేశారు. 6.3 కేవీ విద్యుత్ లైన్‌కి ఈ ఉచ్చు కలిపారు. ఈనెల ఆరో తేదీన సీఆర్పీఎఫ్ పార్టీ కూంబింగ్ నిర్వహిస్తుండగా ఏఎస్ఐ తిరునా వుకరసు ఈ ఉచ్చు తగులుకుని ప్రాణాలు కోల్పోయారు. దీనిపై కేసు నమోదు చేసిన డొంకరాయి పోలీసులు నిందితులను బుధవారం అరెస్టు చేశారు. ఇంతకుముందు నిందితులు ఈ విధంగానే జంతువులను వేటాడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. కరెంటు ఉచ్చు వేయడానికి ఉపయోగించిన సర్వీసు వైర్లు, వెదురు బొంగు కర్రలు, గెడ బొంగు, ఐరన్ బైండింగ్, జీవైర్, ప్లాస్టిక్ గొట్టాలను నిందితులను వారి ఇంటి వద్ద పొదల్లో దాచిపెట్టగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం వారిని రిమాండ్‌కు పంపారు. అటవీ జంతువులను వేటాడటం నేరమని, వేట కోసం కరెంటు ఉచ్చువేస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కరెంటు ఉచ్చులు ఏ గ్రామాల్లో అయినా, ఏ ప్రదేశంల్లో అయినా తారసపడితే పోలీసులకు చెప్పాలని, కరెంటు ఉచ్చువేస్తున్నట్లు ఎవరిమీద అయినా అనుమానం ఉంటే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

- 16.738 కాసుల బంగారం, 7.810 కిలోల వెండి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

కడియం, అక్టోబరు 16: కడియపులంక చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది జూన్ 18న కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు ఇంట్లోకి దొంగలు ప్రవేశించి 108 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, రూ.1,08,000 నగదు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ వై.రాంబాబు సిబ్బంది తో కలిసి కడియపులంకలో చాకలిరేవువద్ద గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పిల్లి సురేష్ అలియాస్ శివను, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన కాండ్రేగుల శ్రావణకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం ఒప్పుకున్నారు. చోరీ సొత్తును అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన పోతంశెట్టి గోపాలకృష్ణారెడ్డికి విక్రయించేందుకు ఉంచినట్టు తెలిపారు. నిందితులు పెనుగొండలో రెండు, ప్రకాశం జిల్లా దర్శిలో ఒకటి, బాపట్ల జిల్లా చందోలులో ఒకచోట దొంగతనాలు చేసినట్టు ఒప్పుకున్నారు. కడియపులంకలో దొంగిలించిన వస్తువులతో పాటు, పెనుగొండ, దర్శిలో నేరాల్లో దొంగిలించిన బంగారు వస్తువులు మొత్తం 16.738 కాసులు, 7.810 కిలోల వెండి వస్తువులను స్వాధీనపరుచుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కడియపులంకలో కేసు ఛేదించడంలో కృషిచేసిన సీఐలు వెంకటేశ్వరరావు, రాంబాబు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.



తుని రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై ఎగసిపడుతున్న మంటలు

తుని రైల్వేస్టేషన్‌లో మంటలు

- పరుగులు తీసిన ప్రయాణికులు
- తప్పిన ప్రమాదం

తునిరూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా తుని రైల్వేస్టేషన్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. రెండో నంబరు ప్లాట్‌ఫారంపై ఒక్కసారిగా మంటలు చెల రేగడంతో ప్రయాణికులు పరుగులు తీశారు. సాయంత్రం విశాఖపట్నం వైపు ప్రయాణిం చేందుకు పెద్దఎత్తున ప్రయాణికులు వేచి ఉన్నారు. రైల్వేలైన్ కింద విద్యుత్‌వైర్లుకి షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగాయి. దీంతో రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు పరుగులు తీశారు. అప్రమత్తమైన రైల్వే ఎలక్ట్రికల్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలను అదుపుచేశారు. ప్రమాద సమయంలో తుని రైల్వేస్టేషన్ మీదుగా ఎటువంటి రైళ్లు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రైల్వే సిబ్బంది త్వరితగతిన మరమ్మతులు చేపట్టి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించడంతో ప్రయాణికులు యథావిధిగా రాకపోకలు సాగించారు.

మన్యంలో మద్యం షాపులకు చిక్కులు

- హైకోర్టును ఆశ్రయించేందుకు గిరిజన నేతలు సిద్ధం
- గ్రామసభల తీర్మానం లేని షాపులను రద్దు చేయాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రంపచోడవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మన్యంలో మద్యంషాపుల మంజూరు వివాదంగా మారి, ఆయా షాపులను న్యాయపరమైన చిక్కులు చుట్టుముడుతున్నాయి. గ్రామసభల ఆమోదం లేకుండా మంజూరుచేసిన మద్యం షాపు లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే మరో ప్రక్క హైకోర్టును ఆశ్రయించేందుకు గిరిజన సంఘాల నేతలు సిద్ధమ వుతు న్నారు. బుధవారం గిరిజన సంఘం అధ్యక్షుడు లోతా రామారావు జిల్లా కలెక్టరుకు, అఖిల భారత రైతుకూలీ సంఘం డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవికి వినతులను అందించి షాపుల రద్దుకు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో మంజూరైన 40 షాపులలో 18 షాపులు రంపచోడవరం, చింతూరు డివిజన్లలోనే ఉన్నాయి. గిరిజన ప్రాంతాల పంచాయతీరాజ్ చట్టం (పీసా) నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లో మద్యం విషయంలో గ్రామసభల తీర్మానాలు అవసరం. ఇక్కడ మద్యం షాపుల లైసెన్సులను ఆయా గ్రామసభల ఆమోదం పొందాకే జారీ చేయాలని కూటమి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టంగా పేర్కొంది. గ్రామసభల తీర్మానాల కోసం ఎక్సైజ్ అధికారులు ఆయా పంచాయతీలను కోరిన 4 వారాల్లో గ్రామసభల నుంచి ఎటువంటి తీర్మానాలు రాకుంటే ఆయా గ్రామసభలు షాపుల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్టే భావించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. కాగా అధికారులు గిరిజన చట్టాలను, ప్రభుత్వ ఉత్తర్వులను ఖాతరు చేయకుండా షాపుల లైసెన్సులు జారీ చేశారని గిరిజనుల ఆరోపణ.

మద్యం షాపులు తెరిచి మూసేశారు

మన్యంలో మద్యం షాపులను ఆయా లైసెన్స్‌లు బుధవారం తెరిచినట్టు తెరిచి ఆ వెంటనే మూసేశారు. పీసా చట్టం కింద గ్రామసభల తీర్మానాలు లేకుండా షాపులను మం జూరు చేసిన అంశంలో వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు జాగ్రత్త పడ్డారు. రంపచోడవరంలో మంజూరైన రెండు షాపు లను నిర్వహించుకునేందుకు మద్యం లైసెన్స్‌లు ఏర్పాటు చేసుకోగా ఇప్పటికే రంపచో డవరం హైవేమీద షాపు ఏర్పాటు చేసుకోవడానికి ప్ర భుత్వ నిబంధనలే అడ్డు వస్తుండగా, దేవీపట్నం రోడ్‌లో ఏర్పాటుచేయాలనుకుంటున్న షాపును బస్‌స్టాండ్, బ్యాంకులు, విద్యాలయాలను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఏర్పాటు చేయరాదంటూ ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ షాపుల ఏర్పాటు విష యంలో సందిగ్ధత నెలకొంది. గ్రామసభల తీర్మానాల అంశంలో వస్తున్న వత్తిడి, న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో ఆయా మండలాల్లో మంజూరైన షాపులకు సంబంధించి ఆయా లైసెన్స్‌లే గ్రామసభల తీర్మానాల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీంతో ఆయా సర్పంచ్‌లపై వత్తిడి తెస్తూ అనుకూలంగా గ్రామసభల తీర్మానాలను పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గ్రామసభల వ్యవహారం తేలేవరకూ మన్యంలో మద్యం షాపులను తెరిచే అంశం ప్రశ్నార్థకమే అవుతోంది.



ఎమ్మెల్యే శిరీషదేవికి ఫిర్యాదు చేస్తున్న రైతుకూలీ సంఘం కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'పరిశ్రమ ఏర్పాటు నిలిపివేయాలి'

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట శివారున బ్రౌన్‌పేట గణేష్ కాలనీ వద్ద మలినవ్యర్థాలను నుంచి ఎరువులు తయారీ చేసే పరిశ్రమను ఏర్పాటుచేయడాన్ని విరమించుకోవాలని జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ఆధ్వర్యంలో గణేష్‌కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు వినతి అందజేశారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభం తొలగింపు

పవన్ చొరవతో పరిష్కారం, ఎక్స్‌లో పోస్టు చేసిన డిప్యూటీ సీఎం కార్యాలయం



తాటిపర్తిలో పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా గతంలో ఉన్న విద్యుత్ స్తంభం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభాన్ని అధికారులు ఎట్టకేలకు తొలగించారు. పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ఈ విద్యుత్‌స్తంభం కారణంగా పలువురు విద్యార్థులు కరెంటు షాక్‌కు గురయ్యారని, దాని వల్ల ఇబ్బందులు పడుతున్నారని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ స్తంభాన్ని తక్షణం అక్కడ నుంచి మార్చాలని, విద్యుత్‌షాక్ కొట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను అదేశించారు. దీంతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు సదరు స్తంభాన్ని అక్కడ నుంచి మార్చి షాక్ కొట్టకుండా రక్షణ చర్యలు చేపటారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం కార్యాలయం బుధవారం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేసింది.



విద్యుత్ స్తంభాన్ని మారుస్తున్న దృశ్యం

పది శాతం రిజర్వేషన్లు పెంచి వర్గీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

కాకినాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే ఇరు తెలుగు రాష్ట్రాల్లో పది శాతం రిజర్వేషన్లు పెంచి వర్గీకరిస్తే అందరికీ న్యాయం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపెళ్ల రాజేష్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ అంశంలో తొందరపాటుకు గురికాకుండా కూలంకషంగా విచారణ జరిపి వర్గీకరణ చేయాలని ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విన్నవించడం జరుగుతుందన్నారు. పంజాబ్ తరహాలో వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని, అలా చేస్తే ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చరిత్రలో నిలిచిపోతారని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, దళిత నాయకులు పిల్లి శివకుమార్, అజయ్, యాళ్ల రాము, కొంకిపూడి ఆనంద్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): 13వ వార్డు రెవెన్యూ కాలనీలో గల ఆర్గానిక్ కంపోస్ట్ ప్లాంట్, సంజయనగర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన బుధవారం పరిశీలించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ కంపోస్ట్ ప్లాంట్‌లలో తడి చెత్తను కంపోస్టుగా మార్చే విధానాన్ని కమిషనర్ పరిశీలించారు. ఏవిధంగా ఆ ప్రక్రియ జరుగుతుందో తెలుసుకున్నారు. ఉత్పత్తవుతున్న కంపోస్టును మొక్కలకు ఎరువుగా వినియోగిస్తున్నామని అక్కడి సిబ్బంది వివరించారు. రానున్న రోజుల్లో బయోమెథనేషన్ ప్రక్రియ ద్వారా తడి చెత్తను గ్యాస్‌గా మార్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. కమిషనర్ వెంట ఈఈ కామేశ్వరరావు, ఏఈ నాగేశ్వరరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృధ్వీచరణ్, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా అనస్తిషియా డే

జీజీహెచ్ (కాకినాడ) అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ అనస్తిషియా డేను అనస్తిషియా వైద్యుల సంఘం, కాకినాడ జీజీహెచ్‌లోని అనస్తిషియా విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా వాకర్స్‌క్లబ్‌లో ప్రాణాపాయంలో ఉన్నవారికి సీపీఆర్ చేసి తిరిగి గుండె కొట్టుకునే విధానంపై అవగాహన కల్పిస్తూ ప్రయోగాత్మకంగా వివరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అనస్తిషియా వైద్య నిపుణులు డా.కామేశ్వరరావు, డా.చక్రరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ 1846లో ప్రారంభమైన ఈ అనస్తిషియాలో డెవలప్‌మెంట్ నానాటికి పెరుగుతూ అడ్వాన్స్‌డ్‌గా ఈ రోజు శస్త్రచికిత్సను నొప్పిలేకుండా చేసేందుకు సులభతరమైందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, అనస్తిషియా హెచ్‌వోడీ డా.ఏ.విష్ణువర్ధన్, ఐఎస్ఏ ప్రెసిడెంట్ డా.అనంతలక్ష్మి, ఏపీ అనస్తిషియా స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ డా.అచ్యుతరామయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డా.జి. ప్రసన్న, డా.అనిల్‌కుమార్, డా.చిట్టికిరణ్ ఉన్నారు.

'భయభ్రాంతులకు గురిచేస్తున్నారు'

కాకినాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లారీ యార్డ్‌లో సీరియల్ పాటించకుండా ఏకపక్షంగా కమిటీ వారే లోడ్లు వేస్తూ తిప్పుతున్నారని, దీనిపై ప్రశ్నిస్తే లారీ యజమానులను బెదిరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని లారీ యజమానులు గూడవల్లి మృత్యుంజయరావు, కడియాల అంజిబాబు, గుమ్మళ్ల సత్తిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. లోడింగ్‌లలో సమాన పని కల్పించాలని కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద లారీ యజమానులు ధర్నా నిర్వహించారు. అనంతరం మృత్యుంజయరావు మీడియాతో మాట్లాడుతూ ఈ యూనియన్ కొనసాగితే తాము ఉండేది లేదన్నారు. ఇక్కడ నుంచి యూనియన్ విడకొట్టి వెళ్లిపోయిన వాళ్లే మళ్లీ వచ్చి పాలిస్తున్నారన్నారు. ఎంపిక నిబంధలకు వ్యతిరేకంగా ఉన్నందునే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

'ప్రతీ గ్రామానికి పరిశుభ్రమైన తాగునీరు'

పెద్దాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీగ్రామానికి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు కృషి చేయనున్నట్లు నెక్కంటి సీఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ నెక్కంటి వెంకట్రావు తెలిపారు. మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో నెక్కంటి సీఫుడ్స్ సంస్థ కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో రూ.లక్షలాది వ్యయంతో వంట షెడ్లు నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, భవిష్యత్తుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ ఉండవిల్లి గోపీచంద్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

పిఠాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల పరిధిలో ఇప్పటి వరకూ నిర్వహించిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎక్సైజు అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ దుకాణాల గడువు ముగిసిన నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమక్షంలో సదరు షాపుల్లో ఉన్న మద్యం నిల్వలను లారీల్లోకి లోడు చేయించి సామర్లకోట ఐఎంఎల్ డిపోకు పంపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు చైతన్యమురళీ ఆదేశాల మేరకు ఈఎస్ కృష్ణకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీల్లో ఎక్సైజు సీఐ శివరామరాజు, ఎస్ఐ విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పిఠాపురంలో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

అనుమతుల్లేకుండానే!

పెనుగుదురులో అక్రమంగా నిర్మించిన వాణిజ్య సముదాయం
సహకరించిన అధికార యంత్రాంగం



పెనుగుదురులో అనుమతులు లేకుండా నిర్మించిన వాణిజ్య సముదాయం



అక్రమ షాపింగ్ కాంప్లెక్స్‌కు కరెంట్ సదుపాయం కల్పించిన దృశ్యం

కరప, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరప-రామచంద్రపురం ప్రధాన రహదారిని చేర్చి పెనుగుదురులో ఒక వ్యక్తి అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాడు. స్థానిక పంచాయతీ కార్యాలయంనుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా సదరు వ్యక్తి ఈ నిర్మాణం చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు నిర్మాణ అనుమతులు ఏమీ తీసుకోకుండా షాపులను ఏర్పాటు చేయడంతోపాటు ఆ షాపుల ముందున్న పంట కాలువపై సిమెంట్ బిల్లలు పరిచి కాలువనూ ఆక్రమించేశాడు. పంచాయతీ కార్యాలయం మంజూరు చేసే నోఅబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) లేకుండానే అధికారులు ఈ షాపింగ్ కాంప్లెక్స్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించడం గమనార్హం. రోడ్డును చేర్చి నిర్మించిన ఈ అక్రమ కట్టడంపై అధికారులెవరూ నోరెత్తకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రోడ్డుపక్కన భారీస్థాయిలో వాణిజ్య సముదాయం అక్రమంగా నిర్మించినా ఆయా శాఖల అధికారులు పట్టించుకోలేదు. సామాన్యులపై ప్రతాపం చూపే అధికార యంత్రాంగం ఈ అక్రమ కట్టడంపై నోరు మెదపకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని ఈ షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పెనుగుదురు పంచాయతీ కార్యదర్శి బి.చంద్రకళను వివరణ కోరగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. దీనిపై సంబంధిత వ్యక్తికి నోటీసు పంపించామని, విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

పలుచోట్ల పల్లె పండుగ కార్యక్రమాలు





సర్పవరం జంక్షన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ: గొల్లప్రోలు రూరల్: శంకుస్థాపన చేస్తున్న మర్రెడ్డి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటూ సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. పల్లె పండుగ -గ్రామ వారోత్సవాల్లో భాగంగా భాగంగా బుధవారం పెనుమర్తి, పండూరు, పి.వెంకటాపురం, సూర్యారావుపేట గ్రామాల్లో రూ.95.20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించే సిమ్మెంట్ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను దశల వారీగా సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగస్టు 22న రాష్ట్రం వ్యాప్తంగా ఒకేరోజు గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజావసరాలను గుర్తించారన్నారు. కాకినాడ రూరల్లో రూ.6.87 కోట్ల నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని కోరారు. పెనుమర్తిలో టీడీపీ సీనియర్ నేత భీమాబత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానాజీ, టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబాలను సత్కరించారు. కూటమి నాయకులు పెంకే శ్రీనివాస బాబా, మట్టా ప్రకాశ్ గౌడ్, రాందేవు సతీయ్యదొర, కరెడ్ల గోవిందు, సోడె మునలయ్య, నందిపాటి త్రిమూర్తులు, ఎంపీడీవో పి.శ్రీనివాస్,ఏపీవో గణేష్ పాల్గొన్నారు.

రోడ్ల పనులకు శంకుస్థాపనలు

కాకినాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పెదపూడి మండలం రామేశ్వరం గ్రామంలో రూ.36 లక్షల 50 వేలతో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా పెదపూడి మండలంలో రూ3 కోట్ల 49 లక్షలతో సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గానికి సంబంధించి సుమారు రూ.14 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. పెదపూడి మండలం ఎన్డీఏ నాయకులు, తెలుగు మహిళలు ఉన్నారు.

'గ్రామాల సుందరీకణకు కృషి'

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 16: గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిద్దేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారని జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరం, ఏపీ మల్లవరం, తాటిపర్తి, చినజగ్గంపేట, వన్నెపూడి, కొడవలి, చెందుర్తి గ్రామాల్లో పల్లెపండుగలో భాగంగా పలు రోడ్ల నిర్మాణ పనులకు ఆయన బుధవారం శంకుస్థాపనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, తహశీల్దారు నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ కృష్ణమోహన్, ఈవోపీఆర్డీ కుమార్, ఏపీవో కొండలరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తాటిపర్తిలో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం వస్తుండగా కొత్తపేటకు చెందిన మహిళలు, అక్కడ ప్రజలు మర్రెడ్డి శ్రీనివాసరావును అడ్డుకుని తమకు మార్గం కల్పించాలని డిమాండ్ చేశారు. అదే గ్రామంలో మరో రోడ్డుకు శంకుస్థాపన చేస్తుండగా బావిశెట్టి పైడియ్య అడ్డుకుని ఫ్లెక్సీ లాగేశాడు. దీంతో అక్కడున్నవారు అతడిని పక్కకు తొలగించి కార్యక్రమాన్ని పూర్తిచేశారు.

ఆక్రమణలపై ఆర్డీవో ఆగ్రహం



గొల్లప్రోలులో స్థల పరిశీలనలో ఆర్డీవో

గొల్లప్రోలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై కాకినాడ ఆర్డీవో మల్లిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని వివాదస్పద స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని బడ్డీలు ఏర్పాటు చేయడాన్ని ఆయన బుధవారం గుర్తించారు. తక్షణం ఆక్రమణలు ఖాళీ చేయించాలని ఆదేశించారు. గొల్లప్రోలు నగరపంచాయతీ డంపింగ్‌యార్డు నిమిత్తం ఎర్రగరువులో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఇక్కడ భూములు కేటాయించేందుకు ప్రతిపాదనలపై పరిశీలన చేశారు. గొల్లప్రోలు, చెందుర్తిలో పెట్రోల్‌బంకుల ఏర్పాటు ప్రతిపాదనలపై సదరు స్థలాలను పరిశీలించారు. గొల్లప్రోలు తహశీల్దారు నాగేశ్వరరావు తదితరులున్నారు.

సీఎం సహాయనిధికి విరాళం

కాకినాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి లక్ష పదకొండు వేల రూపాయిల చెక్కును శ్రీరామకృష్ణ సేవా సమితి ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రతినిధులు బుధవారం సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు అందజేశారు. సేవా సమితి అధ్యక్షుడు వీఎల్ గాంధీ, కార్యదర్శి కె.సతీష్, స్కూల్ కరస్పాండెంట్ కేఎస్ఎన్ శర్మ, పిరంగనాథ్, కె.సుబ్రహ్మణ్యం, కర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో హత్య రాజకీయాలకు ప్రేరేపిస్తున్న వైసీపీ నాయకులపై పోలీస్‌శాఖ కఠిన చర్యలు తీసుకుని ఇటివంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. నగరంలో వైసీపీ రౌడీల ఆగడాలు ఆగ దం లేదు అని అనడానికి మంగళవారం రాత్రి జరిగిన ఉదంతమే నిదర్శనం. స్థానిక దుమ్ములపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు సీరం చిన్న, కోండ్రు తాతారావులు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంపై అక్కసు వెళ్లగక్కిన వైసీపీ గూండాలు ఓ ఆలయంలో ఉన్న వారిద్దరిపై మారణాయుధాలతో దాడి చేసి చిన్న తలపై రాడ్‌తో బలంగా మోదడంతో తీవ్రగాయాలు పాలయ్యారు. తీవ్రగాయాల పాలైన ఇద్దరు టీడీపీ కార్యకర్తలను జీజీహెచ్‌లో బుధవారం ఎమ్మెల్యే వనమాడి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం కాకినాడ నగరాన్ని గూండాలు, రౌడీలు పాలనగా తయారు చేశారన్నారు. ప్రభుత్వం మారినా వారిలో గూండాల సంస్కృతి మారలేదన్నారు. టీడీపీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తునారని సీరం చిన్న, కోండ్రు తాతారావులపై గత వైసీపీ ప్రభుత్వంలో అనేక అక్రమ కేసులు బనాయించి, వేధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, మూగు రాజు, చోడిపల్లి సతీష్, ఏరిపల్లి రాము, కోమటి మహేనమ్మ పాల్గొన్నారు.

'దాడులు దారుణం'

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దుమ్ములపేటకు చెందిన టీడీపీ నాయకులు కొండ్రు తాతారావు, సీరం చిన్నాలపై వైసీపీకి చెందిన నాయకులు మారణాయుధాలతో దాడులు చేయడం దారుణమని జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరాన్ని గుండాల పాలనగా తయారుచేశారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమిని ప్రజలు గెలిపించి రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉండాలని కోరుతున్నారని కానీ ప్రజాస్వామ్యాన్ని కాలరాసేలా ద్వారంపూడి అనుచరులు ప్రవర్తించడం సిగ్గు చేటని, వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత డీఎస్సీ కోచింగ్

పిఠాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకుల కోసం వర్మాస్ కావ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో బుధవారం సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నదని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పిఠాపురం నియోజకవర్గంలో డీఎస్సీకి హాజరయ్యే ఎస్‌జీటీ అభ్యర్థుల కోసం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రహ్మాస్ కోచింగ్ సెంటర్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఎస్టీటీ పోస్టులకు హాజరయ్యే డీఎస్సీ అభ్యర్థులు తమ వివరాలను పిఠాపురంలో అంజనా జూనియర్ కళాశాల చెంతన ఉన్న టీడీపీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలు కోసం సెల్ 8978869999లో సంప్రదించాలని సూచించారు. టీడీపీ నాయకులున్నారు.



పిఠాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



టెక్ హ్యాక్‌థాన్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ

'నూతన ఆవిష్కరణలకు టెక్ హ్యాక్‌థాన్‌లు'

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోడింగ్ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, నూతన ఆవిష్కరణలు చేసేందుకు టెక్ హ్యాక్‌థాన్‌లు దోహదం చేస్తాయని జేఎన్‌టీయూకే వైస్‌చాన్సలర్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 24నుంచి 26 వరకూ నిర్వహించే సాదన 2కె24 టెక్ హ్యాక్‌థాన్ జాతీయ సాంకేతిక పండుగ పోస్టర్లను ఆయన బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదర్శ్ కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అనురాధ, డైరెక్టరు అఖిలేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీఎస్ రాజశేఖర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులున్నారు

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో ముత్యాలమ్మ విగ్రహం సమీపాన నిర్మాణంలో ఉన్న వంతెన పనుల సమీపంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరి వల్ల వర్షానికి రోడ్డు బురదగా మారి స్కూటీపై వెళ్తున్న యువతి ప్రమాదానికి గురైంది. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వెన్నుముక సంబంధిత వ్యాధులపై అవగాహన

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వెన్నునొప్పి కోసం సరైన భంగిమ, వివిధ స్థాయిల్లో గాయాల నివారణకు ప్రజలకు అవగాహన ఎంతో కీలకం అని ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ చందు లింగోలు చెప్పారు. సామర్లకోట మండలం పనసపాడు మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం ప్రపంచ వెన్నుముక దినోత్సవం పురస్కరించుకుని అవగాహనా సదస్సు నిర్వహించారు. డాక్టర్ చందు మాట్లాడుతూ పేలవమైన భంగిమలో అధికసమయం కూర్చోవడం, ధూమపానం, స్టెరాయిడ్స్ తీసుకోవడం ఎముకలకు ఎంతో హానికరమన్నారు. కణితులు, ఇన్ఫెక్షన్‌లు వెన్నుముకకు ప్రభావితం చేస్తాయన్నారు. పనసపాడు మెడికవర్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నందు ఇప్పటివరకూ 100కు పైబడి వెన్నెముక శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేశామని ఆయన తెలిపారు.

చిత్రాడలో డీఈవో తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

పిఠాపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ తనిఖీలు నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులకు డిక్టేషన్ నిర్వహించి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నలుగురికి షోకాజ్ నోటీసులు

పాఠశాలలోవిద్యార్థుల అభ్యసనా శక్తి ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై డీఈవో అసంతృప్తి వ్యక్తం చేసి నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

డిస్లెక్సీయాపై అవగాహన

కరప, అక్టోబరు 16(అక్టోబరు): ప్రత్యేకావసరాలుగల పిల్లల్లోని లోపాలను గుర్తించి వాటిని అధిగమించేలా అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్నట్టు ఐఈఆర్‌టీలు కె.స్వాతి, ఎన్.మల్లేశ్వరి తెలిపారు. కరప హైస్కూల్‌లోని భవిత కేంద్రంలో బుధవారం డిస్లెక్సీయాపై అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లల్లో ఎవరైతే అభ్యసన లోపాలను ఎదుర్కొంటున్నారో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రెమిడియల్ క్లాస్‌ల ద్వారా ఆ లోపాలను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు.

గౌరీదేవి ఉత్సవాల ప్రారంభం

కొత్తపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గాజుల దొడ్డిలో గౌరీ దేవి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సార్వా సీజన్లో పొట్టదశలో ఉన్న వరిదుబ్బును గౌరీదేవిగా ఊరేగించుకుంటూ గాజులదొడ్డిలో ఉన్న ఆలయంలో గౌరీదేవిని ప్రతిష్ఠించారు. అట్లతద్ది నుంచి కార్తీకపౌర్ణమి వరకు సుమారు నెల పాటు గౌరీదేవికి నిత్యం భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. కార్తీక పౌర్ణమిరోజున గౌరీదేవి నందీశ్వరుని సంబరాలతో గౌరీదేవి ఉత్సవాలు ముగుస్తాయని గ్రామస్తులు చెప్పారు.

ఉచిత అన్నదానం ప్రారంభం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ తిమ్మాపురం శివాలయం వద్ద గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి, శివధారణ, భవానీ మాలధారణ భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మాల ధారణ భక్తుల సౌకర్యార్థం 45రోజుల పాటు మధ్యాహ్న సమయంలో అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేస్తున్నట్టు, ఈ అన్నదానం డిసెంబరు 1 వరకు కొనసాగుతుందన్నారు. శివాలయం చైర్మన్ బద్దిలి అప్పారావు, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, కొటికలపూడి అప్పలరాజు ఉన్నారు.

ఘనంగా మహాన్నదానం

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవపట్నం గ్రామం జమునానగర్‌లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని బుధవారం మహాన్నదానం నిర్వహించగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ వడ్డించి ప్రారంభించారు. అంతకు ముందు అమ్మవారికి విశేష పూజలు చేశారు. సుమారు 3వేలమంది భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెంకే వెంకటేష్, పెంకే అరుణ్‌ప్రకాష్, పిల్లి శ్రీను, నాయకుల శ్రీనివాస్, కొప్పిశెట్టి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమూరులో...

పెద్దాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరులో రాజుగారి బీడు ప్రాంతంలో బుధవారం భారీ అన్నదాన నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నేతలు ఏలేటి సుబ్బారావు, మేడిది శ్రీనివాస్, సానిపిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట పంచాయతీకి గత మూడేళ్లుగా నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులు రూ.7.50 కోట్లు, స్టాంప్ డ్యూటీ విడుదలకు ఎమ్మెల్యే పంతం నానాజీ కృషి చేయాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు డిమాండ్ చేశారు. బుధవారం గొడారిగుంటలో గ్రామస్థులతో కలసి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. గ్రామస్థులు మాట్లాడుతూ 2013 నుంచి ఎన్నికలు జరక్కపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రమణయ్యపేట అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బి.సత్యనారాయణరాజు, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

15 తాత్కాలిక మద్యం షాపులు ఏర్పాటు

ప్రత్తిపాడు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 15 తాత్కాలిక మద్యం షాపులు ఏర్పాటు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. ఏలేశ్వరంలో 6, ప్రత్తిపాడులో 3, కిర్లంపూడిలో 2, శంఖవరంలో 4 వంతున ఏర్పాటైన షాపులు ఈ నెల 22 వరకు కొనసాగుతాయని, అనంతరం అనుమతులుపొందిన షాపులు కొనసాగుతాయన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పీహెచ్‌సీలకు ప్రతిపాదనలు సమర్పించాలి

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, అక్టోబరు 16: ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధంచేసి సమర్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కార్యాలయ చాంబరు నుంచి పీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 19 పీహెచ్‌సీలలో వివిధ సౌకర్యాలకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి అందజేయాలన్నారు. ప్రతి గ్రామంలో వ్యాధులు గుర్తించేందుకు నేడు, రేపు రెండు రోజులు సర్వే నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలలో ఆరోగ్యశ్రీ, జననీ సురక్ష పథకాల అమలు తీరుపై సమీక్షించారు. వైద్యాధికారులు, సిబ్బంది పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలని లేకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు, కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) డీఎన్ వీరమణ, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, డీడీ విజయశాంతి, ఈడీవో వై.మల్లేశ్వరరావు, ఈఈ ఐ.శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, సీడీపీవో సంధ్యారాణి, డీఈ సాయిసతీష్, ఎంపీహెచ్‌వో పీటర్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మోతుగూడెం, అక్టోబరు16: డొంకరాయి పోలీస్ చెక్‌పోస్టు వద్ద డొంకరాయి ఎస్ఐ శివకుమార్, సిబ్బంది పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టువద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 3కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా రాష్ట్రంలోని చిత్రకొండ బ్లాక్ నుంచి ఒక బైక్‌పై ముగ్గురు వ్యక్తులు 3కిలోల గంజాయితో రవాణా చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. ఒరిస్సాకు చెందిన భీమాకడ, త్రినాధ్ కడ, ఇంతలూరు వాగుకి చెందిన కిలో పరమేష్‌గా గుర్తించారు. వారిని అరెస్ట్‌చేసి చింతూరు సీఐ ఆదేశాల మేరకు రిమాండ్‌కి తరలించారు.

జీవో నెం.3ని పునరుద్ధరించాలి


ఎమ్మెల్యే శిరీషదేవికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

రంపచోడవరం, అక్టోబరు 16: జీవో నెం.3 రద్దువల్ల ఆదివాసీ నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని సదరు జీవోను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. కిరణ్ మాట్లాడుతూ డీఎస్సీలో గిరిజన ప్రాంతంలో నూరుశాతం గిరిజన అభ్యర్థులతోనే భర్తీచేయాలని, స్పెషల్ డీఎస్సీ కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ జీవో నెం.3 రద్దుకు తన వంతు కృషి చేస్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. పాయం వెంకట్, సోడే చందు, పులిఅశోక్, గౌతమ్ కుమార్, దుర్గప్రసాద్, కోటి, కన్నారావు, శివ కుమార్, ముత్యాలరెడ్డి, వినయ్ విశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

డొంకరాయి పూర్వ విద్యార్థి వితరణ


పూర్వ విద్యార్థి ఇచ్చిన సహాయాన్ని ఎంపీటీసీ విద్యావలంటీర్లకు అందజేస్తున్న దృశ్యం

మోతుగూడెం, అక్టోబరు 16: డొంకరాయి గ్రామంలో మండల పరిషత్, జిల్లాపరిషత్ పాఠశాలలకు బోధన సిబ్బంది కొరత ఉన్నందున స్థానిక ప్రజా ప్రతినిధి ఎంపీటీసీ కరకా వెంకట రమణ ఈ ఏడాది జూన్ నుంచి ఐదుగురు విద్యావలంటీర్లను గ్రామంలో చదువుకున్న యువత నుంచి ఎంపికచేసి, వారికి తన సొంత ఖర్చులతో నెలకు మొత్తంగా రూ.19వేలు వెచ్చిస్తే పేద గిరిజన పిల్లల చదువులకు ఆటంకం లేకుండా చూసుకుంటున్నారు. ఎంపీటీసీ రమణ స్ఫూర్తితో తెలంగాణా రాష్ట్రం విద్యుత్ జనరేషన్ సంస్థ మణుగూరు ప్లాంట్‌లో ఉద్యోగి అయిన డొంకరాయి గ్రామ పూర్వ విద్యార్థి పిల్ల శ్రీనివాసరావు ఈనెల విద్యావలంటీర్లకు అయ్యే మొత్తం గౌరవ వేతనాన్ని రూ.19వేలు అందజేశారు. ఈ సొమ్మును ఎంపీ టీసీ అందించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ అన్ని దానాల కంటే విద్యాదానం గొప్పదన్నారు. పిల్లా శ్రీనివాసరావును అభినందిస్తూ శ్రీనును స్ఫూర్తిగా తీసుకుని గ్రామ పూర్వపు విద్యార్థులు, పెద్దలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమానికి తోడ్పాటునందించాలన్నారు. పిల్లా శ్రీనివాసరావును ఎంపీటీసీ కరకా వెంకటరమణను ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ అభినందించారు.

టీడీపీ గెలుపుకోసం

పనిచేసిన వారిపై అక్రమ కేసులా?

కూనవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో టీడీపీ గెలుపుకోసం పనిచేసిన వారిపై అక్రమ కేసులు బీజేపీ ప్రోత్సహిస్తుందని టీడీపీ మండల కార్యదర్శి మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు అన్నారు. బుధవారం కూనవరం పార్టీ కార్యకర్తల సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ అరకు పార్లమెంటు పరిధిలో టీడీపీ ప్రచార విభాగాలను పోలిపాకు చెందిన ఎస్‌కె రసూల్ అతని భార్య ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. అందులో భాగంగానే అరకు పార్లమెంటు పరిధిలో రసూల్ మూడో స్థానం లో నిలిచి సీఎం చంద్రబాబుతో ప్రశంసా పత్రం పొందారన్నారు. అటువంటి కుటుంబంపై వైసీపీకి చెందిన కొంతమంది అర్ధరాత్రి వేళ ఇంటిపై దాడిచేశారన్నారు. దాడి చేసిన వైసీపీ ముసుగులో ఉన్న వారిని కూటమి పేరుతో బీజేపీ నాయకులు వెనకేసుకొస్తున్నారని చట్టాలను ఆసరాగా చేసుకుని రసూల్ అతని భార్యపై అట్రాసిటీ కేసులు పెట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మండలంలో టీడీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయని గిరిజన మండలాల్లోనే కూనవరం మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 1490 అత్యధిక మెజార్టీ తెచ్చారన్నారు. అంత కష్టపడిన కార్యకర్తలపై కేసులు పెట్టడం చూస్తుంటే పార్టీలో పనిచేయడానికి కార్యకర్తలు వెనుకడుగు వేస్తున్నారని ఆయన అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు బండారు శివయ్య, చెలకాని ఉమామహేశ్వరరావు, లంబు వాసు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు, బూత్ ఇన్‌చార్జి ఎడ్ల రాంబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

చింతూరు, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి) తుమ్మలలో వృథాగా పడి ఉన్న ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సీపీఎం మండల కార్యదర్శి సీసం సురేష్ కోరారు. బుధవారం సీపీఎం నేతృత్వంలో తుమ్మల రైతులు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారంతా పీవోను కోరారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. పాలకులు ప్రజల సమస్యలపై దృష్టి సారించడం లేదని దీంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. శబరి, సీలేరు లాంటి జీవ నదులపై ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి చింతూరు డివిజన్‌లో సాగు విస్తీర్ణం పెరిగేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని సురేష్ కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు పల్లపు వెంకట్, పొడియం లక్ష్మణ్, మొట్టుం రాజయ్య, కృష్ణంరాజు, సోడెరాజు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

రంపచోడవరం, అక్టోబరు 16: రంపచోడవరం ఐటీడీఏ పరిధి మండలాలోని డీఎస్సీ అభ్యర్థులకు సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం బుధవారం ప్రకటనలో తెలిపారు. బీఈడీ, డీఈడీ, టెట్ ఉత్తీర్ణత పొంది కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.5లక్షల లోపు ఉన్న గిరిజన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోగా https:jnanabhumi.ap.gov.in/, https:mdfc.apcfss.in/ వెబ్‌సైట్‌లలో నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఆరు దశల పరిశీలన అనంతరం అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనకు పల్లె పండుగ దోహదం

తుని ఎమ్మెల్యే యనమల దివ్య, పలుచోట్ల పల్లె పండుగ కార్యక్రమాలు


తొండంగి: బెండపూలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తొండంగి, అక్టోబరు 16: బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు పల్లె పండుగ దోహదపడుతుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శృంగవృక్షం గ్రామంలో రూ.15లక్షలు, పాతచోడిపల్లిపేటలో రూ.8లక్షలతోను నూతనంగా నిర్మించనున్న సిమెంటు రహదారు పనుల ప్రారంభానికి ఆమె భూమిపూజ చేశారు. వేలాది కోట్ల రూపాయలతో గ్రామీణ రహదారులను అభివృద్ధి పరిచేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదన్నారు. చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమం సమానస్థాయిలో వేగవంతంగా అమలు జరుగుతున్నాయన్నారు. అలాగే బెండపూడిలో సీసీరోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో సీనియర్ టీడీపీ నేత యనమల రాజేష్, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు కొయ్యా రామకేశవ, పార్టీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, తెలుగు యువత మండలాధ్యక్షుడు బంటుపల్లి అన్వేష్, అరిగెల నర్సింహమూర్తి, కొయ్యా సూరిబాబు, దూలం అప్పారావు, వీరబాబు, సాధనాల నూకరాజు, కొంగర విశాలక్షి, ఎంపీడీవో రాజేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు. ఏవినగరంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ఎమ్మెల్యే యనమల దివ్య ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల రాజేష్, యనమల నాగేశ్వర్రావు, కొయ్యా రామకేశవ, సంస్థ ప్రతినిధులు భాస్కర్, వెంకట్రావు, సుధాకర్ రెడ్డి, సాంబ శివరావు తదితరులు ఉన్నారు.

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు గవరపేట, ఎర్రకోనేరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు తుని ఎమ్మెల్యే యనమల దివ్య శ్రీకారం చుట్టారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, కొల్లు సత్యనారాయణ, గొర్ల వీరబాబు, చిరంజీవి రాజు, కలాగా శ్రీనుబాబు, కతా గోవిందు, గజ్జి రాం బాబు, మర్రి వీరబాబు తదితరులున్నారు.


ఏలేశ్వరం మండలం భద్రవరం గ్రామంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అభివృద్ధితో ముందుకు

గండేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తూ కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మురారి, గండేపల్లి, మల్లేపల్లి, సుబ్బయయ్యమ్మపేట గ్రామాల్లో సుమారు రూ.2.55కోట్ల నిధులతో చేపట్టబోయే సీసీ రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే నెహ్రూ, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, పరిమి బాబు, కుంచే రాజా, ఎంపీడీవో నాతి బుజ్జి, అడబాల భాస్కరరావు, బొండా శ్రీనుబాబు, అడబాల ఆంజనేయులు, వెలమాటి కాశీ, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఏపీవో గంగాభవానీ, ఈసీ రమేష్, గ్రంధి నాగసుబ్రహ్మణ్యం ఉన్నారు.

గ్రామాల ప్రగతికి కృషి

ఏలేశ్వరం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్రగతి పథంలో తీర్చిద్దిడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. లింగంపర్తి, భద్రవరం, సిరిపురం, పేరవరం గ్రా మాల్లో పల్లె పండుగ కార్యమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సత్యప్రభ, ప్రత్తిపాడు జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు హాజరై సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, జ్యోతుల పెదబాబు, జిగటాపు సూరిబాబు, పెంటకోట మోహన్ ఉన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని చింతలూరు, వెంకటనగరం, యుజేపురం గ్రామాల్లో రూ.30లక్షలు విలువ చేసే 3 సిమ్మెంటురోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శంకుస్థాపన చేశారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, డ్వామా పీడీ అడపా వెంకట లక్ష్మి, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాధ్, ఏపీవో కుమార స్వామి, ఏపీఎం వెంకట్, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, జింకల తాతారావు, అమరాది వెంకట్రావు, కురందాస్ అప్పలరాజు, పోలినాటి భగవాన్, పల్లా గోపీ ఉన్నారు.


ఒప్పందం కుదుర్చుకున్న రెండు యూనివర్శిటీల బృందం

'ఆదిత్య' అవగాహన ఒప్పందం

గండేపల్లి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీ బుధవారం అకడమిక్ సహకారాన్ని ప్రోత్సహించడానికి యూనివర్శిటీ ఆఫ్ సౌత్ కరోలినా అప్‌స్టేట్‌తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. విద్య, పరిశోధన, సాంస్కృతిక మార్పిడిలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆదిత్య విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.సతీష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఛాన్సలర్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ జి.సురేష్, డాక్టర్ పిఎస్ రంజిత్, డాక్టర్ మొహ్మద్ తాజ్, డాక్టర్ బెన్నీ ఎల్ హారిస్, యూనివర్శిటీ ఆఫ్ సౌత్ కరోలినా అప్‌స్టేట్ ఛాన్సలర్ డాక్టర్ అలెగ్జాండర్ లోరెంజ్, జేవి మూర్తి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక

ఆదిత్య విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగానికి చెందిన జి.పుష్యమి నాగసాయి 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ క్రీడా పోటీలు గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతాయని చెప్పారు. పుష్యమికి క్రీడా శిక్షకులు జివి ప్రతాప్‌రెడ్డి, బి.అఖిల్, శారీరక విద్యా విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవి అందించిన శిక్షణ ప్రశంసనీయమన్నారు.

వ్యవసాయంపై అవగాహన

కిర్లంపూడి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి గ్రామంలో రాజమహేంద్రవరానికి చెందిన ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ర్యాలీగా వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం పెద్దాపురం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల ద్వారా ఆధునిక సమాచారం అందజేస్తామన్నారు. ఏవో అమృత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు


రౌతులపూడి: అవగాహన కల్పిస్తున్న అధికారులు

రౌతులపూడి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం బలరామపురం రైతు భరోసా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విజయ్ కుమార్ అవగాహన కల్పించి లాభాలను వివరించారు. వ్యవసాయ పరికరాలు రాయితీ తదితర విషయాలను తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధికారి సుంకర బుల్లిబాబు, మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వర్, సర్పంచ్ పైల సీత, ఎంపీటీసీ సోమరౌతు రవి, మాజీసర్పంచ్ పైల పైడిరాజు తదితరులున్నారు.

శంఖవరం: రైతులు సమీకృత పద్ధతులు అవలంబిచడం ద్వారా లాభాలు చేకూరుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్ కుమార్ అన్నారు. కత్తిపూడి, శంఖవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వివరించారు. మండల ఏవో పి.గాంధీ, సహాయ సంచాలకులు ఉద్యాన శాఖాధికారి అరుణ్‌కుమార్,ప్రభాస్ పాల్గొన్నారు.

తునిరూరల్: వ్యవసాయంలో మెళకువలు పాటిస్తే పంటలు లాభసాటి అవుతాయని మండల ఏవో అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని రాజు పేట, ఎస్.అన్నవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి, కూరగాయాలు పండించే రైతులకు అధిక దిగుబడులకు సంబంధించి పలు సూచనలను చేశారు. వరి పంటలో యూరియా వాడకాన్ని తగ్గించి 10 కిలోల పొటాష్ వాడాలని తెలిపారు. ఈ క్రాప్‌న మోదు, పంటల ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, అప్పన రమేష్, పోలిశెట్టి మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: యల్లమిల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో సద్గురుమూర్తి నిర్వహించారు. మినుములు పంట పూత దశలో మారుక మచ్చలు పురుగు చేసే నష్టం, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఉదయ్, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి : మాదేపల్లి


ప్రత్తిపాడులో మాట్లాడుతున్న మాదేపల్లి

ప్రత్తిపాడు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులతో సమన్వయంగా పని చేసి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు తెలిపారు. ప్రత్తిపాడులో కాంగ్రెస్ కార్యాలయం వద్ద బుధవారం పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాదేపల్లి మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి పళ్ళంరాజు, రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి సూచనల మేరకు ప్రతి మండలంలోను పార్టీ బలోపేతం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తొలిసారి ప్రత్తిపాడు విచ్చేసిన మాదేపల్లిని కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.శ్రీను, కొప్పన కోటేశ్వరరావు, కందిమళ్ళ శామ్యూల్ సన్మానించారు.

'మద్యంషాపును తొలగించాలి'

జగ్గంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గోకవరం రోడ్డుని ఆనుకుని ఉన్న మద్యంషాపును తొలగించి రోడ్డుకి దూరంగా పెట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ గోకవరం రోడ్డులో రోజూ నడుకుంటూ వెళ్లే కాలేజీలు, స్కూల్స్, హాస్టల్స్ విద్యార్థులు, మహిళలు మద్యం షాపు వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని, ఉన్నతాధికారులు తక్షణం స్పందించి ఆ బ్రాందీ షాపును రోడ్డుకి దూరంగా పెట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ విజ్ఞంభన నాయకులు మోసే, విద్యార్థులు ఉన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే నెహ్రూ


చంద్రబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే

జగ్గంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాత్రి సీఎం చంద్రబాబును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వివరించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి నియోజకవర్గంలో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని, ఏలేరు వరద బాధితులకు అందించిన సహాయం వారి ముఖంలో చిరునవ్వులు చిందాయని, పల్లె పండుగ కార్యక్రమం ప్రారంభిస్తామని వివరించారు. ఎమ్మెల్యేను సీఎం అభినందించారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తం'

రౌతులపూడి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు అన్నారు. బుధవారం రాత్రి గిడజాం గ్రామంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలపై ఆయ అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు వచ్చినప్పుడు మీ వ్యక్తిగత, బ్యాంక్ ఖాతా ఓటీపీ వివరాలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదని తెలిపారు. సైబర్ నేరం జరిగితే 1930 టోల్‌ఫ్రీకు ఫోన్ చేసి తెలియపరచాలన్నారు. అడవుల్లో జంతువులను వేటాడటం నేరమని, విద్యుత్ ఫెన్సింగ్ వేయరాదని సీఐ హెచ్చరించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, అదనపు ఎస్ఐ రమణ పాల్గొన్నారు.

20న భారతీయ కిసాన్ సంఘం జిల్లా సమావేశం

ప్రత్తిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఈ నెల 20న నిర్వహించే భారతీయ కిసాన్ సంఘం జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా కోరారు. స్థానిక మార్కెట్ సెంటర్, అల్లూరి సీతారామరాజు, ఆర్టీసీ బస్టాండ్, తహశీల్దార్ కార్యాలయ సెంటర్లో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. రైతుల సమస్యలపై చర్చించడం, వారిని సంఘటితపరిచే కార్యక్రమాలు చేపతామన్నారు.

టీడీపీ కార్యకర్త సస్పెండ్

కిర్లంపూడి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని శృంగరాయునిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, 205వ బూత్ ఇన్‌చార్జి అల్లుమళ్ళ నారాయణరావు(బాబీ)ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. బాబీ పార్టీ విధానాలు, కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండడం వల్ల క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

గండేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం గ్రామ శివారున అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని బుధవారం గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు అరెస్టు చేశారు. 14 మద్యం బాటిళ్లు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

5 లీటర్ల సారా స్వాధీనం

జగ్గంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మల్లిశాల గ్రామ శివారున నిర్వహిస్తున్న సారా బట్టిపై బుధ వారం ఎస్ఐ టి.రఘునాధరావు సిబ్బందితో దాడులు నిర్వహించారు. సుమారు 600లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

రౌతులపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగారయ్యపేట గ్రామ శివారు పేకాట శిబిరంపై ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి 10,520 స్వాధీనం చేసుకున్నారు.

డిస్లెక్సీయాపై అవగాహన

జగ్గంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో డిస్లెక్సీయాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎమ్ టీవీఎస్ రంగారావు, ప్రత్యేక అవసరాలు ఉపాధ్యాయురాలు జి.కనకదుర్గ, భవిత స్కూల్ టీచర్ అప్పాన పెద్దకాపు, టీఎస్‌యూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కృష్ణమోహన్ ఉపాధ్యాయులు ఎం.నూకరాజు, సూర్యనారాయణ, ప్రకాష్, కుమార్ మూర్తి ఉన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'


ఏటీడబ్ల్యువోకు వినతి పత్రం అందజేస్తున్న అవుట్ సోర్సు వర్కర్లు

చింతూరు, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి) వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సు వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవా రం సీఐటీయూ ఆధ్వర్యంలో ఔట్ సోర్సు వర్కర్లు ఏటీడబ్ల్యువో సుజాతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. సెప్టెంబరు నాటి వేతనం చెల్లించకపోవడంతో పం డుగపూట కూడా వర్కర్లు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొ ందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సు వర్కర్లకు వారంలో ఒకరోజు సెలవు దినంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్కర్ల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమం చేపడతామని వెంకట్ హెచ్చరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, వర్కర్లు దుర్గారావు, వీరయ్య, పుల్లమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

'మద్యం షాపులు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలి'

రంపచోడవరం, అక్టోబరు 16: రంపచోడవరంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు మద్యం షాపులు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని కలిసి వినతిపత్రం సమర్పించినట్టు మాజీ ఉప సర్పంచ్ కేఎల్ఎన్ గురు ప్రసాద్ తెలిపారు. మార్గంలో పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, ఖాళీ ప్రదేశాల్లో మందుబాబులు మద్యం తాగుతూ బాటిళ్లను అక్కడే వదిలి వెళ్తున్నారన్నారు. హాస్టల్ నుంచి క్లాసులకు వచ్చే విద్యార్థినిలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారన్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు ఇచ్చి మద్యం షాపులు ఏర్పాటు కాకుండా చేయాలని కోరారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు

కాకినాడసిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం తమ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి ఆర్డీవో సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియెట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. సమావేశంలో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, గైనకాలజిస్ట్ డాక్టర్ పి సుజాత, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.